అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 07 జూన్ 2025 పేజీలు : 04

# ఆటలో వాటా ఎవరికి ఎంత..!!

- నాటి ప్రభుత్వ స్కీం..ఆడుదాం ఆంధ్రపై విజిలెన్స్ ఎంక్వైరీ
- ఒక్కో సచివాలయానికి రూ.10 వేల చొప్పున 20 సచివాలయాలకు ఆటలకై కేటాయింపు
- రాష్ట్రవ్యాప్త ఆదేశాల మేరకు గోరంట్లలో ఎంక్వైరీ ప్రారంభించిన విజిలెన్స్ అధికారులు
- ఆడుదాం ఆంధ్రలో పాల్గొన్న 194 క్రీడాకారులు, డ్రిల్ మాస్టర్లు, మండల పరిషత్ అధికారులపై విచారణ


క్రీడాకారులతో విచారణ చేపడుతున్న విజిలెన్స్ అధికారులు

**గోరంట్ల, జూన్ 6 ప్రభాతవార్త**

గత వైసిపి హయాంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పథకంలో అనేక అవినీతి జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జరుగుతున్న విజిలెన్స్ ఎంక్వైరీలో భాగంగా గోరంట్ల మండలంలో సైతం అధికారులు విచారణను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం విజిలెన్స్ ఎస్ఐ గోపాలుడు, వాసు తమ సిబ్బందితో పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో పాల్గొన్న గౌనివారిపల్లి ప్రాంత క్రీడాకారులతోనూ, వివిధ పాఠశాలలకు చెందిన డ్రిల్ మాస్టర్లను ఎంపిడిఒ కార్యాలయానికి పిలిపించి అధికారులు విచారణ నిర్వహించారు.

**గోరంట్ల మండలానికి వచ్చిన నిధులు, ఆడిన జట్ల వివరాలు ఇవే :**

గత ప్రభుత్వ హయాంలో క్రీడల ప్రోత్సాహం పేరుతో ఆడుదాం ఆంధ్ర స్కీం ద్వారా గోరంట్ల మండలంలోని 20 సచివాలయాలకు ఒక్కో సచివాలయానికి 10 వేలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు సంబంధిత అధికారులు తెలియచేస్తున్నారు. ఈ ఆడుదాం ఆంధ్ర ప్రోగ్రాం కార్యక్రమాల్లో భాగంగా గోరంట్ల మండల కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో కబడ్డీలో బాలురు 20 జట్లు, బాలికలు 17 జట్లు, ఖోఖోలో బాలురు 20 జట్లు, బాలికలు 20 జట్లు, క్రికెట్‌లో బాలురు 20 జట్లు, బాలికలు 17 జట్లు, వాలీబాల్‌లో బాలురు 20 జట్లు, బాలికలు 20 జట్లు, బ్యాడ్మింటన్‌లో బాలురు 20 జట్లు, బాలికలు 20 జట్లు పాల్గొన్నట్లు సంబంధిత అధికారులు తెలియచేశారు. అయితే ఈ పోటీల నిర్వహణ కోసం వెచ్చించిన నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఫిర్యాదులపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయి నుండి ప్రతి మండలంలోను విజిలెన్స్ ఎంక్వైరీకి ఆదేశాలు జారీ చేసింది. దీంతో గోరంట్ల మండలంలో క్షుణ్ణంగా విచారణ చేపడుతున్న విజిలెన్స్ అధికారులు రెండో విడత శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో పలువురితో వాంగ్మూలం తీసుకున్నారు. అయితే దుదాం ఆంధ్ర స్కీం ద్వారా విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొన్నప్పటికీ విద్యార్థుల ఎంపికలో మాత్రమే విద్యాశాఖ పాత్ర వుందని నిధులు ఖర్చు చేసిన విషయంలో మండల పరిషత్ అధికారులు మానిటరింగ్ చేసినట్లుగా తెలుస్తోంది. క్రీడల పేరుతో అప్పటి అధికార పార్టీ నాయకులు అధికారులను మభ్యపట్టి క్రీడల కోసం కేటాయించిన నిధులను స్వాహా చేశారా లేక ఆ నిధులను అధికారులు ఏమైనా తప్పుదోవ పట్టించారా అనే వాస్త విషయాలు విజిలెన్స్ అధికారుల విచారణలో తేలాల్సి వుంది.

## టిడిపి నేత సుధాకర్‌నాయుడు హత్యకు స్కెచ్ సంఘటనలో
# పోలీసుల అదుపులో నలుగురు..?

- అనంతపురం డిఎస్పీ శ్రీనివాసులు కేసు దర్యాప్తు
- ఎమ్మెల్యే దగ్గుపాటి, టిడిపి నాయకుడు సుధాకర్‌నాయుడు మధ్య మద్యం వ్యాపారాల్లో పేచినే కారణమా..
- అందరి కళ్లు జిల్లా ఎస్పీ పైనే


పోలీసు అధికారులను కలిసిన సుధాకర్‌నాయుడు దంపతులు


సుధాకర్ నాయుడు


ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**అనంతపురం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త బ్యూరో**

టిడిపి నేత సుధాకర్‌నాయుడు హత్యకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచరులు స్కెచ్ వేశారన్న సంఘటనలో జిల్లా పోలీసు యంత్రాంగం దర్యాప్తును ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ జగదీష్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందాలు ఈ కేసును ఒక కొలిక్కి తెచ్చే విషయంలో కీలకంగా వ్యవహరిస్తూ ఉన్నారు. ఇద్దరు టిడిపి వారే కావడంతో పార్టీ అధిష్టాన వర్గం కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో ఆ దిశలో ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ఎమ్మెల్యే దగ్గుపాటి వర్గీయుల్లో నలుగురిని జిల్లా పోలీసు అధికారుల బృందాలు అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారణ చేస్తున్నట్లు తెలియవచ్చింది. టిడిపి నేత సుధాకర్‌నాయుడు హత్యకు స్కెచ్ వేసి రెక్కీ నిర్వహించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంత మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలియవచ్చింది. ఇదే సమయంలో అనంతపురం డిఎస్పీ శ్రీనివాసులు కూడా ఈ కేసును ఛేదించేందుకు దర్యాప్తును ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. టిడిపి నేత సుధాకర్‌నాయుడుని కూడా డిఎస్పీ కార్యాలయానికి పిలిపించుకుని ఆయన అభిప్రాయాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. మద్యం వ్యాపారాలకు సంబంధించి కూడా వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. శుక్రవారం ఒకరిద్దరు ఎలక్ట్రానిక్ మీడియాతో సుధాకర్‌నాయుడు మాట్లాడుతూ.. కొందరు వైసిపి నాయకులతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి వర్గీయులు తనను హత్య చేసేందుకు ప్లాన్ చేశారని కూడా చెప్పినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను, టిడిపి నేత సుధాకర్‌నాయుడును అమరావతికి పిలిపించుకుని టిడిపిరాయలసీమ జోన్ ఇన్‌చార్జ్ రవీంద్ర చర్చలు జరిపినట్లు వారి మ ధ్య గొడవలను పరిష్కరించే దిశలో గట్టిగా హెచ్చరికలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆ చర్చల తర్వాత సుధాకర్‌నాయుడు అనంతపురంకి వచ్చారు. అయితే ఎమ్మెల్యే దగ్గుపాటి అనంతపురంకి ఇంకా రాకపోవడం గమనించ దగ్గ విషయం. ముఖ్యంగా అనంతపురం నగరంలో మద్యం వ్యాపారాల్లో వచ్చిన వివాదాలే ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు టిడిపి నేత సుధాకర్‌నాయుడుకు గొడవలు వచ్చినట్లు తెలుస్తోంది. అనంతపురం నగరంలో 43 మద్యం షాపులు, 11 బార్లు ఉన్నాయి. ఎమ్మెల్యే దగ్గుపాటికి సంబంధించి ప్రత్యక్షంగా 4 దుకాణాలు ఉన్నట్లు, మరో 8 దుకాణాలు పరోక్షంగా తన అనుచరుల పేరుతో పరోక్షంగా ఉన్నట్లు తెలుస్తోంది. 12 మద్యం షాపులను చేజిక్కించుకునే విషయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి, టిడిపి నేత సుధాకర్‌నాయుడు, మరి కొంత మంది టిడిపి నాయకులు కలిసి మద్యం షాపులు చేజిక్కించుకునేందుకు టెండర్ల సమయంలో గట్టిగా ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే దగ్గుపాటి వర్గం చేజిక్కించుకున్న మద్యం షాపుల్లో టిడిపి నాయకుడు సుధాకర్‌నాయుడు దాదాపు 80 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది. అయితే మద్యం షాపుల వ్యాపారంలో వచ్చిన ఆదాయాల్లో తమకు ఇవ్వలేదని లెక్కాచారాలు చూపడం లేదని తదితర కారణాలతో టిడిపి నేత సుధాకర్‌నాయుడు, ఎమ్మెల్యే దగ్గుపాటి వర్గీయులను ప్రశ్నించినట్లు తెలియవచ్చింది. ఈ విషయంలో సుధాకర్‌నాయుడు తీరుపై ఎమ్మెల్యే దగ్గుపాటి కూడా అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నట్లు తెలియవచ్చింది. ఇందులో భాగంగానే ఎమ్మెల్యే వర్గీయులు కొందరు మద్యం సేవించే సమయంలో టిడిపి నేత సుధాకర్‌నాయుడుని హత్య చేసేందుకు కుట్ర పన్నినట్లు పోలీసు అధికారులకు సమాచారం అందింది. ఈ విషయంలో సుధాకర్‌నాయుడు కూడా పోలీసు అధికారులను కలిసినప్పుడు తనను హత్య చేసేందుకు ఎమ్మెల్యే వర్గీయులు యత్నిస్తున్నారని ఈ పరిస్థితుల్లో తనకు గన్‌మెన్ కావాలని అడిగినట్లు తెలియవచ్చింది. ఈ పరిస్థితుల్లో ఒకవైపు జిల్లా ఎస్పీ జగదీష్ నేతృత్వంలో ఓ పోలీసు అధికారుల బృందం కేసును దర్యాప్తు చేస్తుండగా, మరోవైపు అనంతపురం డిఎస్పీ శ్రీనివాసరావు కూడా దర్యాప్తును వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇంత వరకు బహిరంగంగా జిల్లా పోలీసు అధికారులు నోరు మెదపకపోవడం సస్పెన్స్‌గా ఉంది.

# కోవిడ్ నియంత్రణపై అధికారులు సమన్వయంతో పని చేయండి

- జడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ - రైతాంగాన్ని ఆదుకునే దిశగా చర్యలు తీసుకోండి
- ఆర్‌బికెలలో రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచండి - స్టాండింగ్ కమిటీ సమావేశంలో పలువురు సభ్యులు ప్రస్తావన


స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ

**అనంతపురం సిటీ, ఏప్రిల్ 6 ప్రభాతవార్త**

జిల్లాలోని రైతాంగం ఇబ్బందుల్లో ఉందని వారిని ఆదుకునే దిశగా అధికార యంత్రంగం చర్యలు తీసుకోవాలని పలువురు జడ్పిటిసిలు స్టాండింగ్ కమిటీ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ అధ్యక్షత జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంపై జరిగిన చర్చలో పలువురు సభ్యులు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా వేరుశనగ విత్తనాలను ఇవ్వడం లేదని అందులో ప్రభుత్వ వైఫల్యం, అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. వైసిపి పాలనలో ఆర్‌బికెలను ఏర్పాటు చేసి వేరుశనగ విత్తనాలతోపాటు ఎరువులను అందుబాటులో ఉంచారన్నారు. నేడు ఆర్‌బికె వ్యవస్థను నిర్లక్ష్యం చేశారని నిలదీశారు. జిల్లాకు ఎంత విత్తన వేరుశనగ వచ్చింది, రైతాంగానికి ఏ మేరకు అందుబాటులో ఉంచారన్నది రైతులకు అందుబాటులో ఉంచాలని పలువురు సభ్యులు సూచించారు. అదే విధంగా గత ఖరీఫ్ సీజన్‌లో పంట నష్ట పరిహారం అందించలేదని, రైతులకు పరిహారం అందిస్తే వ్యవసాయం చేసుకునేందుకు దోహద పడుతుందన్నారు. అదే విధంగా విత్తన వేరుశనగతోపాటు నాణ్యమైన కంది విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సభ్యులు సూచించారు. దీంతోపాటు ఈ ఏడాది మామిడి పంట దిగుబడి తగ్గడమే కాకుండా ధర కూడా పతనం కావడంతో రైతుల తీవ్రంగా నష్టపోయారని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, మామిడి రైతాంగాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారని అధికారులు ఆ దిశగా రైతులకు న్యాయం చేసే దిశగా చూడాలని సభ్యులు కోరగా మామిడి రైతులకు పరిహారం ఇచ్చేందుకు అవకాశం లేదని పూర్తిగా చెట్లు పడిపోతేనే సాయం అందించగలమని, ఉద్యాన వన అధికారులు చెప్పిన సమాధానం పట్ల సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు సచివాలయం ద్వారా అధికారులకు సీజనల్ వారీగా అవగాహన కల్పించాలని పలువురు సభ్యులు సూచించారు. ఐసిడిఎస్‌లో నిధుల దుర్వినియోగం జరుగుతోందని సభ్యులు సూచించగా, పారదర్శకంగా చేస్తున్నామని నిధుల దుర్వినియోగంకి ఆస్కారం లేదని అధికారులు పేర్కొన్నారు. కరోనా వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు గ్రామస్థాయిలో వైద్య శాఖ ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టాలని జడ్పీ చైర్మన్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డిప్యూటీ సిఇఒ వెంకట సుబ్బయ్య, జడ్పీ వైస్ చైర్మన్ నాగరత్నమ్మతోపాటు సభ్యులు, పలువురు జడ్పిటిసిలు పాల్గొన్నారు. కాగా సడ్పి సర్వ సభ్య సమావేశానికి అవసరమైన కోరం సభ్యులు లేకపోయినప్పటికీ సమావేశాన్ని సిఇఒ నిర్వహించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



# త్యాగనిరతికి ప్రతీక బక్రీద్ - ఎమ్మెల్యే దగ్గుపాటి

**అనంతపురం కలెక్టరేట్, జూన్ 6 ప్రభాతవార్త**

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్ అని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం నియోజకవర్గంలోని ముస్లిం సోదర, సోదరీమణులకు ఆయన బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పర్వదినం త్యాగం, సంపూర్ణ భక్తి, పేదల పట్ల కరుణను చాటుతుందన్నారు. త్యాగాలకు ప్రతీకైన బక్రీద్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. బక్రీద్ స్ఫూర్తితో సమైక్యత, సమానత్వాన్ని సాధిద్దామని పిలుపునిచ్చారు. అలాగే బక్రీద్ పండుగ నేపథ్యంలో నగరంలోని ఈద్గా, మసీదుల్లో తగిన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు అన్ని విధాలుగా సౌకర్యవంతంగా వుండేలా చూడాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల బ్రాండ్ శాశ్వతంగా ఉండేలా చేస్తాం

- కక్కలపల్లి టమోటా మార్కెట్ లో అట్టహాసంగా ప్రమాణస్వీకారోత్సవం.
- త్వరలోనే రాప్తాడుకు వ్యవసాయ మార్కెట్ యార్డు తీసుకొస్తాం.. పరిటాల సునీత.
- రైతులకు నిరంతరం అందుబాటులో ఉండాలన్న ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే పరిటాల సునీత,శ్రీరామ్.


ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం రూరల్, జూన్ 06 ప్రభాతవార్త**

రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధిలో పరిటాల అనే బ్రాండ్ శాశ్వతంగా ఉండేలా పని చేస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ తో పాటు ఇతర కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమానికి వచ్చిన హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి కే పార్థసారథి, ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ కు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. భారీ గజమాలలు వేసి తమ అభిమానం చాటుకున్నారు. అనంతరం అక్కడి నుంచి భారీ ఊరేగింపుగా కక్కలపల్లి టమోటా మార్కెట్ వరకు వచ్చారు. అనంతరం ప్రమాణస్వీకారోత్సవం పండుగ వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమానికి వేలాదిమంది కూటమి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ నూతన మార్కెట్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాప్తాడు నియోజకవర్గంలో విస్తృతంగా పంట సాగు ఉందని.. అయితే ఎంత ఖర్చు పెట్టి పంటలు సాగు చేసినా సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోతుంటారన్నారు. ఇలాంటి సమయంలో మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యులు చొరవ తీసుకుని రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. మార్కెట్ యార్డ్ కార్యాలయంలో కూర్చుని ఉండకుండా నిరంతరం హార్టీకల్చర్, వ్యవసాయశాఖ అధికారులను సమన్వయం చేసుకుని గ్రామాల్లో పర్యటించాలన్నారు. ఏ ప్రాంతంలో ఎక్కువగా ఏ పంట సాగు చేస్తున్నారో అక్కడ దిగుబడులు ఇతర ప్రాంతాలకు ఎలా తరలించాలన్నది సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల ముందు జగన్ని గద్దె దించేందుకు ఏ విధంగా పోరాటం చేశారో.. ఇప్పుడు రైతుల కోసం అదే తరహాలోనే పని చేయాలన్నారు. గతంలో ఉన్న వారు సరిగా పని చేయలేదు కాబట్టే మీకు ఇప్పుడు అవకాశం వచ్చిందన్నారు. మీకు ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారం ఎప్పటికీ ఉంటుందని.. రైతుల కోసం పని చేయాలని శ్రీరాం సూచించారు. మరోవైపు పరిటాల సునీత మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఇప్పుడు మార్కెట్ యార్డ్ కమిటీలో స్థానం దక్కిన ప్రతి ఒక్కరూ ఆ పదవులకు వన్నె తెచ్చే విధంగా పని చేయాలన్నారు. గతంలో ఎక్కువ మంది పోటీ ఉండటం వలన చివరి వరకు కమిటీ ఏర్పాటు కాలేదని.. చివర్లో పదవులు ఇచ్చినా.. సమయం తక్కువగా ఉండటం వలన సరిగా పని చేయలేకపోయారన్నారు. ఇప్పుడు మీకు నాలుగేళ్ల సమయం ఉంటుందని.. కచ్చితంగా రైతులకు ఉపయోగపడే విధంగా పని చేయాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో విస్తృతంగా పంటలు సాగు ఉన్న నేపథ్యంలో ప్రత్యేకంగా మార్కెట్ యార్డ్ అవసరం అన్నారు. గొందిరెడ్డిపల్లి దగ్గర 30ఎకరాల స్థలం ఉందని.. ఇప్పటికే కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లామన్నారు. కచ్చితంగా త్వరలోనే మార్కెట్ యార్డు వస్తుందని..అప్పటి వరకు రాప్తాడులో కార్యాలయం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నూతన కమిటీ సభ్యులంతా నిరంతరం రైతులు పండిస్తున్న పంటలను పరిశీలించాలని.. వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేలా చూడాలన్నారు. ఒక రైతుకు ఒక పంటలో బాగా లాభం వస్తే.. మిగిలిన వారు కూడా ఒకే సమయంలో ఒకే రకమైన పంటలు వేయడం వలన గిట్టుబాటు ధరలు ఉండటం లేదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులకు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని సలహాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించి.. రైతులకు ఏం కావాలన్నది తమ దృష్టికి తీసుకొస్తే.. కచ్చితంగా వాటిని ఎంపీ సాయంతో ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. గతంలో ఫ్యాక్షన్ ప్రాంతంగా ఉన్న రాప్తాడుకు ఓ వైపు హంద్రీనీవా, మరోవైపు పీఏబీఆర్ నీరు తీసుకొచ్చి రైతులు పంటలు పండించుకునే విధంగా చేశామన్నారు. ఇప్పుడు రాప్తాడు వ్యవసాయంలో అగ్రగామిగా ఉందని రానున్న రోజుల్లో ఇంకా అభివృద్ధి పనులు చేయాల్సి ఉందని.. పరిటాల అనే బ్రాండ్ గుర్తుండేలా పనులు ఉంటాయని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు. మరోవైపు ప్రమాణస్వీకారం అనంతరం ఛైర్మన్ సుధాకర్ చౌదరి, ఇతర కమిటీ సభ్యులు మాట్లాడుతూ పరిటాల కుటుంబాన్ని తమ జీవితంలో మర్చిపోమని. రైతుల కోసం శక్తివంచన లేకుండా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ మండల, టిడిపి నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ అర్జీలకు సమగ్రంగా పరిష్కారం చూపాలి

- యాదృచ్ఛికంగా సిఎం కార్యాలయం పిజిఆర్ఎస్ అర్జీదారునికి ఫోన్ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్
- పిజిఆర్ఎస్ అర్జీకి సంబంధించి సమగ్రంగా పరిష్కారం చేయని తహశీల్దార్‌కు షోకాజ్ నోటీస్ జారీ
- విఆర్‌ఓకు కాషన్ నోటీస్ జారీ చేయాలని జిల్లా కలెక్టర్ అదేశం


అర్జీలను వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం కలెక్టరేట్, జూన్ 6 ప్రభాతవార్త**

అనంతపురం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం పిజిఆర్ఎస్ కంట్రోల్ రూమ్‌కి వెళ్లి పిజిఆర్ఎస్ అర్జీలు, వాటి పరిష్కారంపై వివరాలను జిల్లా కలెక్టర్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం యాదృచ్ఛికంగా (ర్యాండం) సిఎం కార్యాలయం నుండి వచ్చిన పిజిఆర్ఎస్ అర్జీదారురాలికి జిల్లా కలెక్టర్ ఫోన్ చేసి మాట్లాడుతూ మీరు ఏమని అర్జీ పెట్టారు, మీకు ఏమైనా ఎండార్స్మెంట్ వచ్చిందా, మీ అర్జీ గురించి మీకు ఎవరైనా మాట్లాడారా, తహశీల్దార్, విఆర్ఒ ఏం చెప్పారు, మీ అర్జీకి పరిష్కారం చూపించారా, ఎప్పటిలోపు పరిష్కారం చూపిస్తారు అన్న తదితర వివరాలను ఆరా తీశారు. అర్జీదారురాలి తనయుడు మాట్లాడుతూ మా అమ్మ పేరు మీద కొంత భూమి ఉంది, ఆ భూమి జాయింట్ ఎల్పీఎంలో వుందని దానిలో ఆమె భాగం ఆమెకు ఆన్లైన్‌లో ఎక్కించాలని అడగడం జరిగిందని, మాకు పరిష్కారం చూపించలేదని తహశీల్దార్, విఆర్‌ఓతో మాట్లాడిన స్పష్టంగా వివరించలేదని, ఈ విషయమై సిఎం కార్యాలయంలో అర్జీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత గ్రామ విఆర్‌ఒ, ఆ మండల తహశీల్దార్‌లతో మాట్లాడారు. మీకు సంబంధిత సమస్యపై అవగాహన ఉందా, ఎప్పటిలోపు సమస్య పరిష్కారం చేయగలుగుతారు, అడిగిన దాని ప్రకారం చేయడానికి వీలు అవుతుందా, అవ్వదా, అర్జిదారురాలికి ఏం చెప్పారు, మొత్తం సమస్య గురించి విఆర్‌ఒ చెప్పారా లేదా, తదితర వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సిఎం కార్యాలయం పిజిఆర్ఎస్ అర్జీకి సంబంధించి సమస్య పరిష్కారం అయినట్లు తెలియడం లేదన్నారు. ఈ సమస్యకు సరిగా పరిష్కారం చూపలేదని, ఎన్ని రోజుల లోపల దీనిని పరిష్కారం చేయగలుగుతాము, చేస్తామా, చేయలేదో చెప్పలేదని, వివరాలు కూడా అర్జీదారురాలికి పూర్తిగా చెప్పలేదని, సరైన సమాచారం వారికి ఇవ్వలేదని, సమస్యను సమగ్రంగా పరిష్కారం చేయాలనే ఉద్దేశం లేదని, ఇందుకు మీపై చర్యలు వుంటాయన్నారు. సిఎం కార్యాలయం పిజిఆర్ఎస్ అర్జీకి సంబంధించి సమస్యను పరిష్కరించని సంబంధిత విఆర్ఒ, తహశీల్దార్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అర్జీని క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేసి ఫోటో కూడా అప్లోడ్ చేయలేదని, నిర్ణీత సమయంలోపు పరిష్కారం చేయలేదన్నారు. సంబంధిత అర్జీకి సంబంధించి నివేదికను జాయింట్ కలెక్టర్‌కు పంపించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత గ్రామ విఆర్‌ఓకి కాషన్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. సంబంధిత మండల తహశీల్దార్‌కు సోకాజ్ నోటీస్ జారీ చేయాలన్నారు. పిజిఆర్ఎస్ తహశీల్దార్‌కు కూడా షోకాజ్ నోటీస్ ఇవ్వాలన్నారు. సీఎం కార్యాలయం పిజిఆర్ఎస్ అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వే ఏడి రూప్లానాయక్, పిజిఆర్ఎస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీ సీనియర్ నేత బాబురెడ్డి హఠాన్మరణం

- షాక్ లో వైసీపీ శ్రేణులు


నివాళులర్పిస్తున్న ఉషశ్రీ, దీపిక వేణురెడ్డి


బాబురెడ్డి (ఫైల్ ఫోటో)

**హిందూపురం జూన్ 6 ప్రభాతవార్త**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెనుకొండ మాజీ సమన్వయకర్త చల్లాపల్లి బాబు రెడ్డి (47) గుండెపోటుతో శుక్రవారం మధ్యాహ్నం కన్నుమూశారు. అంతకు ముందు సోమవారం గుండెపోటు రావడంతో బెంగళూరులోని అస్టర్ హాస్పిటల్‌కు తరలించారు. గుండెకు స్టంట్ వేసిన తర్వాత ఆరోగ్యం నిలకడగా ఉండేది. ఐసీయూ నుంచి స్పెషల్ వార్డుకు శుక్రవారం షిఫ్ట్ చేశారు. హిందూపురం నియోజకవర్గ ఇన్చార్జ్ దీపిక వేణు రెడ్డి మధ్యాహ్నం 2 గంటల సమయంలో హాస్పిటల్లో బాబురెడ్డిని పరామర్శించి మాట్లాడారు. ఆ తర్వాత ఉన్నట్టుండి మరోసారి తీవ్రమైన గుండెపోటు రావడంతో వెంటనే బాబురెడ్డి మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న హిందూపురం, పెనుకొండ వైసీపీ శ్రేణులు షాక్ కు గురయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ, కొండూరు వేణుగోపాల రెడ్డి, శ్రీరామారెడ్డి, ఎన్ఎ శివకుమార్, ప్రశాంత్ గౌడ్, ఆసిఫుల్లా, కొటిపి హనుమంత రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి బాబు రెడ్డి భౌతిక కాయని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వగ్రామం సోమందేపల్లి మండలం చల్లపల్లి గ్రామంలో శనివారం ఉదయం 11 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు గుడ్డంపల్లి వేణు రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా చిన్న వయసులోనే రాజకీయాల్లో ట్రబుల్ షూటర్ గా బాబు రెడ్డి గుర్తింపు పొందారు. స్వస్థలం చల్లపల్లి కాగా వ్యాపార రీత్యా బెంగళూరులో ఆయన స్థిరపడ్డారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కీ అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. దీంతోపాటు వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డితో కూడా ఆయనకు సాన్నిహిత్యం ఉంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి దీపిక గెలుపు కోసం బాబు రెడ్డి క్రియాశీలకంగా పనిచేశారు. సమర్థవంతమైన నేతగా తమతో సత్సంబంధాలు కలిగి ఉన్న బాబు రెడ్డి హఠాన్మరణం ఆ పార్టీ శ్రేణుల్లో తీవ్ర విషాదం నింపింది.

## అసత్యాలు చెప్పిన ఇఒ.. ఆ స్థలం మాదే




విలేకరులతో మాట్లాడుతున్న సుంకు బద్రీనాథ్

**హిందూపురం జూన్ 6 ప్రభాతవార్త**

పట్టణంలోని లేపాక్షి రోడ్డులో షిరిడి సాయిబాబా ఆలయం సమీపంలో ఉన్న రెండెకరాల 16 సెంట్లు స్థలం దేవాదాయ శాఖ చెందినదని ఇఒ నాగేంద్రుడు ఇచ్చిన స్టేట్మెంట్ పూర్తిగా అసత్యమని సుంకు బద్రీనాథ్, ఎన్ఏ రాజేష్, బలరాం ఖండించారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం వారు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో రోడ్డు పక్కన అనామత్తుగా దుకాణాలు వేసుకున్న వారితో కలిసి ఈవో నాగేంద్రుడు మూడు రోజుల కింద ట ప్రెస్ మీట్ నిర్వహించిన విషయం తెలిసిందే. దీనికి కౌంటర్ గా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ స్థలం 1920 లోనే కొనుగోలు చేయడం జరిగిందని బద్రీనాథ్ వివరించారు. అయితే దేవదాయ శాఖ వారు దీనిపై కోర్టుకు వెళ్లగా మూడు కోర్టుల్లో కూడా వారి పిటిషన్ ను కొట్టివేయడం జరిగిందని వెల్లడించారు. అంతేకాకుండా స్థలానికి సంబంధించి హక్కుదారులమనే రికార్డులు లేనప్పటికీ కోర్టులో పిటిషన్లు వేసిన దేవాదాయ శాఖ పై కోర్టు జరిమానా కూడా విధించిందని గుర్తు చేశారు. వీటన్నింటికీ సంబంధించిన కోర్టు ఉత్తర్వులను ప్రెస్ మీట్ లో మీడియా ఎదుట ప్రదర్శించారు. సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో ఈసీ లో కూడా తమ పేర్లు ఉన్న ప్రతులను అందించారు. కాగా ఈ ప్రాంతంలో రోడ్డు పొడవునా అన్యాక్రాంతంగా దుకాణాలు వేసుకుని ప్రధాన రహదారి ఆక్రమించినందున మున్సిపల్ అధికారులు తొలగించేందుకు వచ్చారని చెప్పారు. ఇందులో తమ ప్రమేయం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఇఒ అబద్దాలు ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు.

## స్కాలర్షిప్‌కు ఎంపికైన విద్యార్థులు

**హిందూపురం టౌన్ జూన్ 06 ప్రభాతవార్త**



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

పరిగి మండలం మోదా ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం అందించే స్కాలర్షిప్ కు ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న శిరీష, జి.ఎస్ చిరైవ్య కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఎన్ఎంఎస్ఎస్ పరీక్షలో ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ప్రతియత 12 వేల రూపాయలు స్కాలర్షిప్ అందించనుంది ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయులు రాజశేఖర్, కరణం గురు రాజారావు, రామారెడ్డి, మదన్మోహన్ రెడ్డి, నారాయణస్వామి తదితరులు అభినందించారు.

## అంగన్వాడి కార్యకర్తల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

**హిందూపురం టౌన్ జూన్ 06 ప్రభాతవార్త**

పట్టణంలోని పాత హస్నాబాద్, కొత్త హస్నాబాద్, కరుణాపురం అంగన్వాడి కేంద్రాలలో శుక్రవారం అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి కార్యకర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్తలు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో ఆటపాటలతో పాటు ఆంగ్ల విద్యను బోధిస్తామని అంగన్వాడీ కేంద్రంలో అందించే విద్య ప్రాథమిక పాఠశాలకు పునాది అని అంగన్వాడీ కేంద్రంలో మీ పిల్లలను చేర్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు లక్ష్మీనరసమ్మ, రాజేశ్వరి, షాహిద, సుజాత విద్యార్థులు పాల్గొన్నారు.

## సబ్సిడీ విత్తన వేరుశెనకాయలను పరిశీలించిన మండల తెదేప నాయకులు

**రొద్దం, జూన్ 6 ప్రభాతవార్త**

సబ్సిడీ విత్తన వేరుశన కాయలను తెదేపా మండల నాయకులు శుక్రవారం రొద్దం సచివాలయంలో పరిశీలించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం 40 సబ్సిడీతో రైతులకు అనతి కాలంలోనే ఇతని వేరుశనగను అంతే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి ఆయా సచివాలయ పరిధిలో వేరుశనగ బస్తాలను నిల్వ జరుగుతుందని సబ్సిడీ ధరతో ఒక బస్తా రూ.1674 చొప్పున ప్రభుత్వం నిర్ణయించిందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేయడం జరిగింది ప్రతి ఒక్క రైతు ఆధార్ పాస్ బుక్ జిరాక్స్ లింక్ అయిన ఫోన్ నెంబర్ తో వ్యవసాయ అధికారులను సంప్రదించి కొనుగోలు చేసుకోవాల్సిందిగా నాయకులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నరహరి చంద్రమోళి మాధవ నాయుడు టైలర్ ఆంజనేయులు నరసింహులు తిరుపాల్ నాయుడు వీరాంజనేయులు సిద్ధన్న ఉమాశంకర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలు




వృద్ధాశ్రంలో బ్రెడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, జూన్ 06 ప్రభాతవార్త**

ప్రియతమ నాయకుడు రాప్తాడు మాజి శాసనసభ్యులు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలను రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాలలో ఘనంగా జరుపుకున్నారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రకాష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆకుతోటపల్లి గ్రామంలోని వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు వైఎస్ఆర్సిపి నాయకులు లింగారెడ్డి, నరేందర్ రెడ్డి, సునీల్ దత్త రెడ్డి, హరినాథ్ రెడ్డిలు బ్రెడ్లు పండ్లు పంపిణీ చేశారు.

## 6 నుండి 9 తరగతులకు ప్రవేశంకు అప్లై చేసుకోండి

**కనగానపల్లి జూన్ 6 ప్రభాతవార్త**

శుక్రవారం మోడల్ స్కూల్ నందు 6 నుండి 9 వ తరగతులలో మిగిలిపోయిన సీట్ల కొరకు విద్యార్థిని, విద్యార్థులు ఈనెల 20వ తేదీలోగా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవికిరణ్ తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

## 10న జిల్లాస్థాయి యోగాంధ్ర కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఏ పిడి నరసయ్య

**లేపాక్షి, జూన్ 6 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన లేపాక్షిలో ఈ నెల 10వ తేదీ మంగళవారం ఉదయం 6 గంటలకు జిల్లా స్థాయి యోగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిఆర్‌డిఏ పిడి నరసయ్య తెలిపారు. యోగ కార్యక్రమంపై స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం మండలస్థాయి అధికారులతో యోగా నిర్వహణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యోగ నిర్వహణ ప్రత్యేకంగా నిర్వహిస్తోందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా లేపాక్షిలో నిర్వహిస్తున్న జిల్లా కార్యక్రమానికి మండలంలోని అధికారులు, ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మీపై వుందన్నారు. పర్యాటక ప్రదేశాల్లో యోగా నిర్వహించడం వల్ల పర్యాటకం మరింత అభివృద్ధి చెందే అవకాశం వుందన్నారు. యోగాపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఆర్డీఓ ఆనంద్‌కుమార్ హాజరవుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపిడిఓ నరసింహమూర్తి, సిడిపిఓ శాంతి, టిడిపి మండల కన్వీనర్ అభిలాష్, డిప్యూటి తహశీల్దార్ కుమారస్వామిరెడ్డి, ఏపిఎం జయచంద్ర, నవోదయ ప్రిన్సిపాల్ నాగరాజు, ఎంఇఓ నాగరాజు, మండల సమైక్య అధ్యక్షురాలు అరుణ, మండల కార్యదర్శులు, విఆర్ఓలు, అధికారులు పాల్గొన్నారు.

## లేపాక్షి పిహెచ్‌సిలో గర్భవతులకు వైద్య పరీక్షలు

**-గర్భవతులకు పౌష్టికాహారం అందచేసిన లేపాక్షి ఆలయ చైర్మన్**



గర్భవతులకు పౌష్టికాహారం అందిస్తున్న దృశ్యం

**లేపాక్షి, జూన్ 6 ప్రభాతవార్త**



గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన లేపాక్షి పిహెచ్‌సిలో శుక్రవారం డాక్టర్ వెంకటచిరంజీవి ఆధ్వర్యంలో 63 మంది గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురు గర్భవతులు రక్తహీనతకు గురయ్యారని, వారికి తగు సూచనలు అందచేశారు. అనంతరం డాక్టర్ వెంకటచిరంజీవి మాట్లాడుతూ గర్భవతులు శారీరకంగా ఆందోళనకు గురికారాదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను కలవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. గర్భవతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రమామణి చారిటబుల్ ట్రస్ట్ అధినేత, లేపాక్షి ఆలయ చైర్మన్ కరణం రామానందన్ గర్భవతులకు పౌష్టికాహారాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఓ సీతామాలక్ష్మి, ఎంపిహెచ్ఓ సుబ్రహ్మణ్యం, పిహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఫిజియోథెరపీతో ఆరోగ్య సమస్యలు దూరం



ఫిజియోథెరపీ గురించి వివరిస్తున్న ఫిజియోథెరపిస్ట్

**బత్తలపల్లి, జూన్ 6 ప్రభాతవార్త**

ఫిజియోథెరపీతో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రమేష్ తెలిపారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్తు కార్యాలయ సమావేశ భవనంలో అనంతపురం జిల్లా ప్రజా పరిషత్తు ముఖ్య కార్య నిర్వాహణ అధికారి ఆదేశాల ప్రకారం ఫిజియోథెరఫీ మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపును డాక్టర్ రమేష్, సంతోష్ కుమార్ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోజూ ఫిజియోథెరఫీ చేయడం వలన కలిగే ప్రయోజనాలు, ఆహారపు అలవాట్లు వలన కలిగే ఆరోగ్యం తదితర విషయాలను విశదీకరించారు. ఈ కార్యక్రమం లో మండల పరిషత్తు అభివృద్ధి అధికారి నరసింహ నాయుడు, పరిపాలన అధికారి జి.శ్రీనివాసులు, ఉప మండల పరిషత్తు అభివృద్ధి అధికారి పి.క్రిష్ణప్ప, కార్యాలయ సిబ్బంది, జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

## సీనియర్ నాయకుడు తిమ్మయ్య మృతి పార్టీకి తీరని లోటు

**రొద్దం. జూన్ 6 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఇప్పటివరకు ఎనలేని సేవలు అందించాడని ఒక మంచి నాయకుడిని కోల్పోయామని మంత్రి సవిత ఆవేదన వ్యక్తం చేసింది ఈ సందర్భంగా మండల పరిధిలోని పెద్ద గువ్వల పల్లి గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు మాజీ డీలర్ ప్రతి ఒక్కరికి సుపరిచితుడు గ్రామస్తులకు శ్రేయోభిలాషి అయినా తిమ్మయ్య అనారోగ్యంతో గురువారం సాయంకాలం కన్ను వేయడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు మాలో ఒకడుగా ప్రతి ఒక్క కార్యక్రమానికి ముందుండి నడిపించే వ్యక్తి ఈరోజు లేడన్న విషయం జీర్ణించుకోవడానికి కావట్లేదని కన్నీరు మున్నీ రయ్యారు విషయం తెలిసిన వెంటనే మంత్రి సవిత మండల తెదేపా నాయకులు పెద్ద గువ్వల పల్లి గ్రామానికి చేరుకొని మృతుని భార్య ను ఓదార్చి మీ కుటుంబానికి ఎల్లవేళలా తెలుగుదేశం పార్టీ మేము అండగా ఉంటామని భరోసా కల్పించి తిమ్మయ్య మృతదేహం మీద పసుపు జెండా కప్పి నివాళులర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో నరహరి చంద్రమోళి మాధవ నాయుడు చిన్నపయ్య వెంకటరామిరెడ్డి వీరాంజనేయులు నరసింహులు సిద్దన్న తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

## 8న హేమావతిలో యోగాంధ్ర కార్యక్రమం

**అమరాపురం జూన్ 6 ప్రభాతవార్త**

మండల పరిధిలో హేమావతి సిద్ధేశ్వర స్వామి దేవాలయం నందు యోగాంధ్ర కార్యక్రమాన్ని ఈనెల 8న ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రామారావు తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 6:30 గంటలకు ప్రారంభమవునని స్థానిక అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు మరియు 60 ఏళ్ల వయస్సు కలిగిన వృద్ధులు కూడా అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం నందు మండల పరిపాలన అధికారి ఆరాధ్య మరియు అధికారులు పాల్గొన్నారు.

## స్నానపు ఘాట్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

**పుట్టపర్తి టౌన్, జూన్ 6, ప్రభాతవార్త**

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా నడియాడినటువంటి పుణ్య ప్రదేశం చిత్రావతి నదిని సుందరీ కరణంగా తీర్చిదిద్దడమే కాకుండా పుట్టపర్తికి వచ్చే పర్యాటకులకు పవిత్ర చిత్రావతి నదిలో స్నానం ఆచరించుటకై స్నానపు గాట్లు నిర్మాణముకై శుక్ర వారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి భూమి పూజ చేశారు. ఈ చిత్రావతి నదిలో దేశ విదేశీ భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం చిత్రావతి నది తీరాన 29 లక్షలతో ఐదు స్నానపుగాట్లను ఏర్పాటు చేసేందుకై నేడు భూమి పూజ కార్యక్రమం నిర్వహించామని చిత్రావతి నది తీర ప్రాంతంలో స్నానపు ఘాట్లతో పాటు సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాలలోపు చిత్రావతి నది తీరాన్ని పర్యాటకులను ఆకట్టుకునే విధంగా సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు రామ్ లక్ష్మణ్, గంగాధర్, ఉమాపతి, శేషు, పాపారెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాల్మీకి మహర్షి ధర్మబోధలు సమాజానికి మార్గదర్శకం...!

**- బిజెపి నాయకులు హరీష్ బాబు.**



వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట భూమి పూజలో హరీష్ బాబు

**ధర్మవరం, జూన్ 06 ప్రభాతవార్త**

ధర్మవరం రూరల్ మండలంలోని మల్లాకాలువ గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ స్థాపనకు భూమి పూజ కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి వాల్మీకి సోదరుల ఆహ్వాన మేరకు ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై, పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. వాల్మీకి మహర్షి జీవితం, ధర్మబోధ, సమాజ సేవపై హరీష్ బాబు తమ ప్రసంగంలో వివరించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు గ్రామ సచివాలయాన్ని సందర్శించి అక్కడి ఉద్యోగులతో సమావేశమయ్యారు. గ్రామ ప్రజలకు సేవలందించడంలో పారదర్శకత మరియు సమయపాలన తప్పనిసరి అని సిబ్బందికి సూచించారు. ప్రజల అవసరాలకు అందుబాటులో ఉండాలని, సమస్యలు ఎదురైన వెంటనే పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని సలహా ఇచ్చారు. తదుపరి, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వేరుశెనగ విత్తనాల పంపిణీ పరిస్థితిని తెలుసుకున్నారు. విత్తనాల అందుబాటు, పంపిణీ విధానం, రైతులకు ఇవ్వాల్సిన సమాచారం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. రైతు బాగుంటేనే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుంది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షులు గొట్లూరు చంద్ర, గ్రామ పెద్దలు, వాల్మీకి సోదరులు, బీజేపీ కార్యకర్తలు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## హాకీలో నంద్యాలజట్టుపై సత్యసాయి జట్టు విజయం



నంద్యాలజట్టుపై గెలిచిన సత్యసాయి జిల్లా జట్టుతో కోచ్, మేనేజర్లలు

**ధర్మవరం, జూన్ 6,ప్రభాతవార్త**

హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో భీమవరంలో జరుగుతున్న హాకీ టోర్నీలో సత్యసాయిజిల్లా జట్టు తొలివిజయం సాదించినట్టు కోచ్ మారుతీకుమార్, మేనేజర్ అరవిందగౌడ్లు పేర్కొన్నారు. శుక్రవారం సత్యసాయి జిల్లా, నంద్యాల జట్లుతలపడగా 160గోల్స్ సత్యసాయిజిల్లా జట్టు గెలుపొందిందని వారు తెలిపారు. దీంతో సత్యసాయి జిల్లా హాకీ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ బంధనాధం సూర్యప్రకాశ్, జిల్లా కార్యవర్గసభ్యులు అబినందనలు తెలియజేశారు.

## బాలికలకు కరాటేతోనే ఆత్మరక్షణ



సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

**ధర్మవరం, జూన్ 6,ప్రభాతవార్త**

కరాటేతోనే ఆత్మరక్షణ ఉంటుందని కొత్తపేట బాలికల ఉన్నతపాఠశాల హెచ్ఎం మేరివరకుమారి, కరాటే మాస్టర్ ఇనాయత్ బాషాలు తెలిపారు. స్థానికకొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నతపాఠశాలలో మల్టిస్టార్ బుడోఖాన్ కరాటే అకాడమి కరాటే మాస్టర్ ఇనాయత్బాషా ఆధ్వర్యంలో శుక్రవారం బెల్టాండింగ్ టెస్టు నిర్వహించారు. ఈటెస్టులో షాహీన్, హనీఫ్, కారీ కేయ, యస్మిత్, అఖిల్కుమార్, ఉదయ్, సాయిఈశ్వర్, ప్రణవ్, మహమ్మద్బ జాలు ప్రతిభ కనబరిచారు. వీరికి హెచ్ఎంతోపాటు సీనియర్ కరాటే బ్లాక్ బెల్టర్స్ నవ్యశ్రీ, శ్రీనాథ్ నాయుడు, గంగాధర్, హర్షిని, ఇర్షాద్, మహిదర్లు సర్టిఫికెట్లు, యల్లో, ఆరంజ్,గ్రీన్, బ్లూబ్రౌన్ బెల్టు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడా రంగంలో రాణించాలన్నారు.

## జాతీయ ఉపకార వేతనానికి విద్యార్థిని ఎంపిక

**ధర్మవరం రూరల్ జూన్ 6**

ప్రభాతవార్త ధర్మవరం మండలంలోని ధర్మపురి ప్రాథమికోన్నత పాఠశాల నుండి మధులిక జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సౌభాగ్యమ్మ తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ 2024 25 విద్యా సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ జాతీయ ఉపకార వేతనానికి మన పాఠశాల నుండి మధులిక విద్యార్థిని ఎంపిక కావడం చాలా హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు కుల్లాయప్ప నాగరాజు, ధర్మపురి గ్రామస్తులు మధులిక ను అభినందనలు తెలియజేశారు.



**ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయుల**

మున్సిపల్ భూములను

## హరిత భూమిగా అభివృద్ధి చేస్తాం...!

**- ప్రజల హక్కుల పరిరక్షణే మా ధ్యేయం...!**



రెవిన్యూ కాలనీలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్, బీజేపీనాయకులు,కాలనీ వాసులు

**ధర్మవరం, జూన్ 6,ప్రభాతవార్త**

మున్సిపల్ భూమిని హరిత భూమిగా అభివృద్ధి చేస్తామని బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ హరీశ్ బాబుతెలిపారు. పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డు సమీపంలో ఉన్న రెవిన్యూ కాలనీ ప్రజలు తమ నివాస ప్రాం తానికి అనుకుని ఉన్న 91సెంటంల మున్సిపల్ భూమి ఆక్రమణకు గురవుతోందని స్థానికులు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్కుమార్, బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ హరీశ్బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతోస్పందించిన వారు రెవిన్యూ కాలనీలో శుక్రవారం పరిశీలించి ఆ ప్రాంతంలో ఫెన్సింగ్ ఏర్పాటుచేసి మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ. ప్రజల సొమ్ము అయిన మున్సిపల్ భూములు ఎవరి స్వప్రయోజనాలకు బలికాకూడదని, భవిష్యత్తుతరాలకు హరిత వాతావరణం అందించేందుకు ఈ స్థలాన్ని పరిరక్షించి పచ్చదనంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు బత్తులు వీరనారాయణ, రామ్మోహన్, రాయపాటిశివ. డాక్టర్లు వెంకటరెడ్డి, వాసుదేవరెడ్డి, లింగారెడ్డి, ఓబిళేశు, సుధాకర్, పాండురంగ,మహేశ్ పాల్గొన్నారు.

## నూతన వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు



వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్న సైంటిస్ట్

**బత్తలపల్లి, జూన్ 6 ప్రభాతవార్త**

పంటల సాగులో రైతులు నూతన వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక దిగుబడులను సాధించాలని పలువురు సైంటిస్టులు పేర్కొన్నారు. శుక్రవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం బత్తలపల్లి, సంజీవపురం గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో అధిక మోతాదు లో ఉపయోగించే ఎరువులు, పురుగు మందులకు స్వస్థి చెప్పి, పంటల సాగులో రైతులు వైవిధ్యతను ప్రోత్సహించాలని కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి , రేకులకుంట లైవ్ స్టాక్ రీసర్చ్ స్టేషన్ శాస్త్రవేత్తలు డాక్టర్ శశికళ, డాక్టర్ జాహ్నవి , డాక్టర్ శ్రీనివాస్ నాయక్, రఘు కరణ్ లు మండల రైతులకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో పలు తెలియజేశారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశంలోని ఏడు వందల జిల్లాల్లో రెండు వేల కంటే ఎక్కువగా శాస్త్రీయ బృందాలు గ్రామాలలో పర్యటించి నూతన సాంకేతికత, కేంద్ర రాష్ట్ర వ్యవసాయ పథకాల పై సమాచారం, నూతన వ్యవసాయ పద్ధతులు, వంగడాల విషయాలు, డ్రోన్ స్ప్రేయింగ్ తదితర అంశాలను రైతులకు తెలిపారు. పంటల సాగులో అనువైన విత్తనాలు, రకాలు వాతావరణ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు సూచనలు పాటించడం, తక్కువ మందుల పిచికారీ తదితర అంశాలు అధిక దిగుబడుల పై ఆధార పడి ఉంటాయన్నారు. ప్రతి పంట సాగుకు ముందు పచ్చి రొట్ట ఎరువులు వేయడం ద్వారా భూసారం పెరుగుతుందని తెలియ జేశారు. అనంతరం భూసార పరీక్ష పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలను, వ్యవసాయంలో ఎదుర్కొంటున్న సమస్యలను వాటి నివారణ చర్యల గురించి చర్చించారు. అలాగే వివిధ రంగాల్లో కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే సబ్సిడీ పథకాల గురించి, విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి వివరించారు, ఈ కార్యక్రమాన్ని మే 29 నుంచి జూన్ 12 వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో ప్రతి రోజు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ శశికళ తెలిపారు. ఈ కార్యక్రమంలో, శాస్త్రవేత్తలు డాక్టర్ శశికళ, డాక్టర్ జాహ్నవి,బత్తలపల్లి మండల వ్యవసాయ అధికారి ఓబి రెడ్డి , సిద్దరాంపురం పశు పరిశోధన కేంద్రం సైంటిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీనివాస్,ఉపేంద్ర రెడ్డి , రైతు సేవ కేంద్రాల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కేశఖండన కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యేలు.ఎంపీ

**కేశఖండన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు**



మాజీ ఎంపీ, వైఎస్ఆర్సిపి నాయకులు.

**అనంతపురం రూరల్, జూన్ 06 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం పూలకుంట గ్రామ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయ కులు, చియ్యేడు మాజీ సింగల్ విండో ప్రెసిడెంట్ మద్ది రెడ్డి శివారెడ్డి కుమారుని కేశఖండన కార్యక్రమం ఆయన నివాసం వద్ద శుక్రవారం నిర్వహించగా ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్సిపి మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, కేదిరెడ్డి వెంకటరామిరెడ్డి, హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, వీరితోపాటు సర్పంచులు ఎంపీటీసీలు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై మద్ది రెడ్డి శివారెడ్డి కుమారిని ఆశీర్వదించారు.

## మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకులు



బుల్లెట్ రఫీకి శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు.

**అనంతపురం రూరల్, జూన్ 06 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం రాచా న పల్లి పంచాయతీ సిండికేట్ నగర్ కు చెందిన బుల్లెట్ రఫీ రాప్తాడు మార్కెట్ డైరెక్టర్ గా ఎంపికై శుక్రవారం ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా సిండికేట్ నగర్ టిడిపి నాయకులు బద్దెల మంజునాథ్,బిల్లా నాగరాజు, పూత్తా ఎర్రిస్వామి, వీరేష్, వెంకట రాముడు, రాజా, పలువురు నియోజకవర్గం, మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

# భారత ఆర్మీ త్రివిధ దళాల పతాక నిధికి విరాళం

అనంతపురం , జూన్ 6 ప్రభాతవార్త బ్యూరో

ఆపరేషన్ సిందూర్ విజయ స్ఫూర్తితో భారత ఆర్మీ త్రివిధ దళాల పతాక నిధికి రూ.1,0116/ రూపాయల విరాళాన్ని శుక్రవారం నాడు కోవూరు నగర్ లో ఉన్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో అధికారి పి.తిమ్మప్పకు అనంతపురము హరిశ్చంద్ర ఘాట్ అధ్యక్షులు తిరువీధుల జగదీష్, ట్రెజరర్ డి.సాయినాథ్ గుప్త విరాళపు చెక్కును అందించారు. ఆపరేషన్ సిందూర్ స్ఫూర్తి తో దేశ సరిహద్దులో ఎముకలు కొరికే చలిలో దేశ రక్షణ విధులు నిర్వహిస్తున్న సైనికులకు వెన్ను దన్నుగా మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం భారత ఆర్మీ త్రివిధ దళాల పతాక నిధికి రూ.101116/ విరాళాన్ని స్థానిక గుత్తి రోడ్డులో ఉన్న అనంతపురము హరిశ్చంద్ర ఘాట్ అధ్యక్షులు తిరువీధుల జగదీష్, ట్రెజరర్ డి.సాయినాథ్ గుప్త తదితర దాతలు స్వచ్ఛందంగా విరాళాలు అందజేయడం అభినం దనీయమని ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప ధన్యవాదాలు తెలిపారు. అలాగే భారత ఆర్మీ త్రివిధ దళాల పతాక నిధికి ఉదారంగా విరాళాల్ని అందించాలని, ఉమ్మడి జిల్లాల దాతలకు జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప విజ్ఞప్తి చేశా రు. తమ విరాళాలకు ఆదా య పు పన్ను మినహా యింపు కూడా ఉంటుందని, త్రివిధ దళాల ప తాక నిధికి విరాళాలు ఇవ్వాలనుకున్న దాతలు అనం తపురము కోవూరు నగర్ మూడవ క్రాస్ లో ఉన్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయం (08554 -241146)లో సంప్రదించవచ్చని లేదా జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ అనంత పురము ఎస్బిఐ సుభాష్ రోడ్ బ్రాంచ్ బ్యాంక్ అకౌంట్ నెంబర్ 62076956433, ఐఎఫ్ ఎస్సీ కోడ్ ఎస్బిఐఎన్0 021438కు ఆన్లైన్ ద్వారా తమ విరాళాలను అందించవచ్చని ఉమ్మడి జిల్లాల సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప తెలిపారు..



విరాళాలు అందజేస్తున్న దృశ్యం

# కరోనా వైరస్ కోవిడ్-19 పట్ల ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలి

## - శింగనమల సిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహిత్

శింగనమల, జూన్ 6 ప్రభాతవార్త

కరోనా కోవిడ్-19 వైరస్‌కు ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం అందించేలా చర్యలు చేపడుతామని కరోనా వైరస్ కోవిడ్-19 పట్ల ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహిత్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని సిహెచ్‌సిలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ.. గత మూడు నాలుగు సంవత్సరాల క్రితం కోవిడ్-19 కరోనా వైరస్ పట్ల ప్రజలందరూ తగుజాగ్రత్తలు తీసుకోవాలని, ఇప్పుడు కోవిడ్-19 పేరు వింటున్నామని అందులోనూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో పాతూరులో కరోనా పాజిటివ్ రావడం బాధాకరమని తెలిపారు. కోవిడ్-19 శ్వాసకోస వైరస్, దగ్గు, జ్వరం, చలి, తలనొప్పి, గొంతునొప్పి, ముక్కుకారడం, లేదా మూసుకుపోవడం, తుమ్ములు, చాతిలో అసౌకర్యం, ఆకలి తగ్గడం, వాంతులు, విరేచనాలు, అలసట, కండరాల లేదా శరీర నొప్పులు, రుచి లేద వాసన కోల్పోవడం, బలహీన త, గురక వంటి అనేక లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఇప్పుడు కరోనా వైరస్ వ్యాధికి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసు పత్రిలో వైద్యం అందించనున్నట్లు తెలిపారు. కావాల్సిన పరికరాలు, మందులు, శానిటైజర్స్, మందులు అందుబాటు లోకి తీసుకొచ్చామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో శింగనమల ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నిరకాల వ్యాధులకు చికిత్స అందించి వ్యాధి నయమయ్యేలా చూస్తామని ఆయన తెలిపారు.


డాక్టర్ రోహిత్

# దళిత విద్యార్థినిని గర్భవతిని చేసిన నిందితులను తక్షణం అరెస్టు చేయాలి - ఎంఈఎఫ్ నేతలు

అనంతపురం న్యూటౌన్, జూన్ 6 ప్రభాతవార్త

శ్రీ సత్య సాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాల పల్లికి చెందిన 14 ఏళ్ల దళిత విద్యార్థినిని దాదాపు 12 మంది యువకులు బలవంతంగా అత్యాచారం చేసి గర్భవతిని చేసిన దారుణ సంఘటనకు బాధ్యులైన నిందితులపై ఫోక్సో కేసు నమోదుచేసి, తక్షణం అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్ )జాతీయ ఆదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ డిమాండ్ చేశారు. దోషులు ఎంతటి వారైనా, ఏ కులానికి చెందినా, ఏ పార్టీకి చెందినా వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆ బాలిక గర్భం దాల్చిన విషయం బయటికి పొక్కడంతో ఆమె తల్లిని, ఆ విద్యార్థినిని ఇద్దరినీ భయభ్రాంతులకు గురిచేసి, గర్భం దాల్చిన విషయాన్ని బయటకు చెబితే చంపేస్తామని బెదిరించి, కేసు పెట్టకుండా వారిని దాచిపెట్టడం ఘోరం. ఇలాంటి కీచకులకు శిక్షలు పడకపోతే ఇలాంటి దుర్ఘటనలు మళ్లీమళ్లీ పునరావృతమై అనేకమంది నిరుపేద అమాయక దళిత విద్యార్థినులు తమ మానప్రాణాలను పోగొట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. ఇలాంటి దుర్ఘటనలను అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు కుల సంఘాలు వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. నిందితుల తరపున న్యాయవాదులు ఎవరూ కేసును వాదించడానికి ముందుకు రాకూడదని ఈ సందర్భంగా న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. ఈ దుర్ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యా ణ్‌కి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కి మెయిల్ ద్వారా ఫిర్యా దు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మన్నె పాకుల రమేష్, గౌరవ సలహా దారులు సాకే పెద్దన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఎగ్గిడి రామన్న, నగర అధ్యక్షులు మీసాల నాగభూషణ, నగర ప్రధాన కార్యదర్శి కొడవండ్ల నారాయణస్వామి, నాయకులు మీసాల రామ్మూర్తి, సంజప్ప, ఎంసీ నాగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈఎఫ్ నేతలు

# పని ప్రదేశంలో మహిళల భద్రత చాలా ముఖ్యం

అనంతపురం వైద్యం జూన్ 6 ప్రభాతవార్త

మహిళలు పని చేసే ప్రదేశాలలో వారిపై లైంగిక వేధింపులు జరగకుండా భద్రత చర్యలు చేపట్టడం చాలా ముఖ్యం అని పలువురు వత్తుల అభిప్రాయపడ్డారు. లైంగిక వేధింపుల నివారణ నిషేధ సంస్కరణ చట్టం ప్రకారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పోష్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ప్రిసైడింగ్ ఆఫీసర్ గా డిప్యూటీ ఆర్ ఎం ఓ డాక్టర్ గుజ్జల హేమలత నియమించబడ్డారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల సర్జరీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ ఆర్ ఎం ఓ డాక్టర్ హేమలత మాట్లాడుతూ ఈ కమిటీ మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల గురించి అంతర్గత ఫిర్యాదులు కమిటీగా పని చేస్తుందని చెప్పారు. లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించడానికి ఈ చట్టం ఏర్పడిందని తెలిపారు. ఈ కమిటీలో తనతోపాటు గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ షబానా బేగం, గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరిండెంట్ జి. నాగమణి, సీనియర్ అడ్వకేట్ శశికళ నియమితులయ్యారని పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు తరచుగా నమోదవుతూ ఉంటాయి, ఇటువంటి సంఘటనలు పని ప్రదేశంలో లైంగిక వేధింపులు కిందకు వస్తాయని కార్యాలయాల్లో లైంగిక వేధింపులు అనేది చిన్న విషయం కాదని దీనిని తేలికగా తీసుకోకూడదని అన్నారు. వేధించే వ్యక్తి యజమాని, సహఉద్యోగి ఎవ్వరైనా కావచ్చు, చాలామంది మహిళలు ఈ విషయంలో మౌనంగా ఉంటారు, వేధింపులు గురించి చెప్తే ఏమవుతుందో అని అనుకుంటారు, ఇంట్లో సమస్యలు మొదలవుతాయని భయప డతా రు. అవసరమైతే ఉద్యోగం కూడా మానేస్తారు. కానీ ఇది సరైన పద్ధతి కాదు, లైంగిక వేధింపులు జరిగినప్పుడు ఖచ్చితంగా ఇంటర్నల్ కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు. ఈ విషయాన్ని అత్యంత గోప్యంగా ఉంచి విచారణ జరిపిస్తాము అన్నా రు. డా. షబానా మాట్లాడుతూ శారీరక సంబంధం , అనుచితంగా తాకడం, సంజ్ఞలు, ఎవరైనా శారీరకంగా అసౌకర్యంగా ఫీల్ అయ్యేలా చేయ డం వేధింపుల కిందకు వస్తయని అంతేకాదు ఉద్యోగంలో ఏదైనా చేయాలంటే ఎలాంటి లైంగిక ప్రయోజనాల కోసం అడుగుతు న్నారనేది కూడా ఇందులో ఉంటుంది. లైంగిక వ్యాఖ్యలు చేయడం, అశ్లీల కంటెంట్ ను షేర్ చేయడం కూడా పోష్ చట్ట ప్రకారం నేరము అన్నారు. అడ్వకేట్ శ్రీమతి శశికళ మాట్లాడుతూ పోష్ ఆక్ట్ గురించి అవగాహన అనేది ఉద్యోగస్తులైన మహిళలందరికీ చాలా ముఖ్యమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసుపత్రి అన్ని విభాగాలకు సంబంధించిన మహిళా సిబ్బంది పాల్గొన్నారు


మాట్లాడుతున్న డి. ఆర్.ఎం.ఓ డా.జి హేమలత

# సీనియర్లకు అన్యాయం చేసే విధంగా వ్యవహరించిన ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోండి

అనంతపురం న్యూటౌన్, జూన్ 6 ప్రభాతవార్త

సీనియర్లకు అన్యాయం చేసే విధంగా వ్యవహరించిన ఉపాధ్యాయునిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గౌని పాతిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాల సహాయకుల (ఫిజికల్ సైన్స్) పదోన్నతులలో ప్రస్తుతం ఉన్న సీనియారిటీ లిస్టులో 38వ నెంబర్ ఉపాధ్యాయులు సి.రాఘవేంద్ర ప్రస్తుతం కళ్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం ఎంపీయూపీ పాఠశాలలో పనిచే స్తున్నారు. రీఅపోర్షన్‌లో అతని పోస్ట్ పోవడం జరిగింది. ప్రస్తుత స్టేషన్లో 2023 నుండి 2025 వరకు పనిచేశాడు. అంతకు మునుపు స్టేషన్లో 2017 నుంచి 2023 వరకు పనిచేశాడు. ఆ విధంగా అతను ప్రీవియస్ స్టేషన్ పాయింట్లు వాడుకున్నా 17.5055 రావాలి. కానీ అతను 8 సంవత్సరాలు పనిచేసినట్లు 24 పాయింట్లు వేసుకున్నాడు. ఈ విషయం గ్రీవెన్స్ సమయంలో మండల విద్యాశాఖ అధికారి గారికి తెలియజేయగా మేడం గారు డిఈఓ ఆఫీస్‌కి వెళ్లి సదరు ఉపాధ్యాయునికి 24 పాయింట్లు తొలగించి 17.5055మా పాయింట్లు వేయించడం జరిగింది. కానీ తర్వాత అతను డీఈఓ ఆఫీస్‌లో తన పలుకుబడిన ఉపయోగించుకుని 24 పాయింట్లు వేసుకుని ప్రస్తుతం కౌన్సిలింగ్‌లో సీనియర్లకు అన్యాయం చేస్తూ మంచి ప్లేస్ (జడప్పిహెచ్ఎస్ కాలువపల్లి) కోరుకోవడం జరిగింది. కావున అధిక పాయింట్లు వేసుకున్న అతని మీద శాఖాపరమైన విచారణ చేపట్టి వారిపై తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అలానే జిల్లాలో మరి కొంతమంది ఉపాధ్యాయులు ప్రీవియస్ స్టేషన్ పాయింట్లు ఎక్కువగా వేసుకోవడం జరిగింది. అలాంటి వారిపైన కూడా విచారణ చేపట్టి వారిపై కూడా తగు చర్యలు తీసుకోవాలని కోరు చున్నాం.

# కమనీయం శివపార్వతుల కళ్యాణం

అనంతపురం వైద్యం జూన్ 6 ప్రభాతవార్త

అనంతపురం నగరంలోని అరవింద నగర్ లో ఉన్న సర్వేశ్వరాలయంలో శివపార్వతుల కళ్యాణం కమనీయంగా సాగింది .రెండు రోజులపాటు ఘనంగా సాగిన వివిధ ఆధ్యాత్మిక కార్యక్ర మాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఉదయం మహాశివు డికి ఏకవార మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అలంకార సేవలు జరిగాయి. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం సంప్ర దాయ సిద్ధంగా జరిపించారు. గవి మఠం పీఠాధిపతి డాక్టర్ కరి బసవ రాజే ంద్ర స్వామీజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి భక్తులందరికీ శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆయన అనుగ్రహ భాషణం చేస్తూ ధర్మమార్గం లోనే భక్తులు నడుస్తూ ఉత్తమ సమాజాన్ని నిర్మించాలని ఉద్బోధించారు .మానసిక ప్రశాం తతను పెంచే భక్తి భావాన్ని అందరిలో పెంచేందుకు ఆలయాలు విద్యాల యాలుగా విరాజిల్లుతున్నాయన్నారు. అనంతరం భక్తులందరికీ స్వయంగా తీర్థప్రసాదాలను అందిం చి ఆశీర్వదించారు. సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకులు గురుమూర్తి నేతృత్వంలో భారీ నగరోత్సవ వేడుకలు జరిగాయి వివిధ దేవత మూర్తుల వేషధారణలో కళాకారులు ఆకట్టుకున్నారు . ముఖ్య ంగా ప్రాచీన కళారూపమైన గురవయ్యల నృత్యం అమితంగా అలరించింది.


భక్తులను ఆశీర్వదిస్తున్న గవి మఠం పీఠాధిపతి కరి బసవ రాజేంద్ర స్వామి

# ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం

అనంతపురం వైద్యం జూన్ 6 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్‌గా తన ప్రమాణ స్వీకారం మహోత్స వానికి హాజరు కావాలని రాష్ట్ర సహకార శాఖ మంత్రి కింజరపు అచ్చమ నాయుడుని ఎడిసిసి బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి ఆహ్వాని ంచారు. శుక్రవారం విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్ మురళితో మంతిని కలసి వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేసి ప్రమాణ స్వీకారోత్సవానికి వచ్చి తనను ఆశీర్వదించాలని కేశవ రెడ్డి కోరారు. ఇందుకు మం త్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.


మంత్రి కింజరపు అచ్చమ నాయుడుని ప్రమాణ స్వీకారోత్సవానికి రావాలని ఆహ్వానిస్తున్న దృశ్యం

# వేసవి శిక్షణ శిబిరము ముగింపు కార్యక్రమం

అనంతపురం న్యూటౌన్, జూన్ 5 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సనల్ ఇంచార్జ్ శివనారాయణ శర్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ అధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం అనంతపురంలో 28-04-2025 నుంచి 06-06-2025 వరకు విద్యార్థిని విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు ఘనంగా నిర్వహించారు. వేసవి శిక్షణ శిబిరం నందు పర్సనాలిటీ డెవలప్మెంట్ డాక్టర్ బృందా, శ్రీరాములు, మోటివేషన్, మహేష్ పుస్తకాలను చదివించి కథలను చెప్పి, విద్యార్థినీ విద్యార్థుల చేత కథలను చెప్పించారు. అదే విధంగా డ్రాయింగ్ పెయింటింగ్ వినోద్ కుమార్, ఇంగ్లీష్ గ్రామర్ ఇంగ్లీష్ జీకే హరి, యోగ మాస్టర్ ఆసనాలు వెంకటేశప్ప నేర్పించారు. కరాటే మాస్టర్ శ్రీనివాసులు, డాన్స్ మాస్టర్ రమేష్ కుమార్ నేర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు దాదాపుగా 250 మంది శిక్షణ పొందారు. హరీష్ కుమార్ యాదవ్ ఫౌండేషన్ వారు విద్యార్థిని విద్యార్థులకు ప్రతిరోజు ఉచితంగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఇంగ్లీష్ దినపత్రికను ఉచితంగా అందజేస్తున్నారు. వీరి ముఖ్య ఉద్దేశం స్పీక్ ఇం గ్లీష్, రైట్ ఇంగ్లీష్. నేడు (గురు వారం) వేసవి శిక్షణ శిబిరము ముగింపు కార్యక్రమము నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో జా యింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ చేత బహుమతి ప్రధానం, మోమె ంటోస్, సర్టిఫికెట్స్ విద్యార్థినీ విద్యార్థులకు ఇవ్వబడు ను. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రోత్సాహ బహుమతులు అందజేస్తున్న దృశ్యం

# కిషోర్ వికాసం అవగాహన సదస్సు

నార్పల జూన్ 06, ప్రభాతవార్త

నార్పల మండలం సిద్దారచర్ల గ్రామంలో అంగన్వాడి సెంటర్ నందు కిషోర్ వికాస కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నార్పల ఐసిడీస్ ప్రాజెక్టు సిడిపిఓ ఎం భారతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సంద ర్భంగా సిడిపిఓ భారతి మాట్లాడుతూ బాలికల అక్రమ రవాణా, బాలికల విద్య, బాలికల రక్షణ గురించి తెలియజేశారు. సమతల ఆహారం పౌష్టికాహార ప్రాధాన్యత గురించి వివరించారు. రుతుక్రమం వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. బాల్య వివాహాలు, నిషేధిత చట్టం, మరియు రక్షణ చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్ మధుశాలిని, ఎం.ఎల్.వి అమృత, మహిళా పోలీస్ భాగ్యలక్ష్మి, అంగన్ వాడి కార్యకర్తలు పి. సువర్ణ, త్రునిత, హెల్పర్లు గంగమ్మ, ఆశా కార్యకర్త ఈశ్వరమ్మ మహిళలు తదితరులు పాల్గొన్నారు.


: మొక్కలను నాటుతున్న టిడిపివో భారతి

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో యోగ పైన అవగాహన సదస్సు

అనంతపురం వైద్యం, జూన్ 6 ప్రభాతవార్త

అనంతపురం నగరంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో యోగాంధ్రలో భాగంగా యోగ విశిష్టత గురించి అవగాహన సదస్సును నిర్వహించారు ప్రభు త్వ సర్వజన వైద్యశాల సూపర్డెంట్ కే ఎస్ ఎస్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సుకు వివేకానంద యోగా కేంద్ర నిర్వాహకులు రాజశేఖర్ రెడ్డి వైద్యులు హరిప్రసాద్ శంకర్ నారాయణ యోగ శిక్షకులు మారుతి ప్రసాద్ లు ముఖ్య అతిథులుగా హాజరై యోగా విశిష్టత గురించి వైద్యులకు సిబ్బందికి తెలియ జేశారు. ప్రతిరోజు యోగాసనాలు చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆనందాన్ని సైతం పొందుతారని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ జూన్ 21వ తేదీన నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెనెడిక్ట, డాక్టర్ మనోరంజన్ రెడ్డి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సౌజన్య కుమార్, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి జి హెచ్ సూపరింటెండెంట్ కే ఎస్ ఎస్ వెంకటేశ్వరరావు

# పి.నారాయణపురంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం

కూడేరు, జూన్ 5 ప్రభాతవార్త

మండల పరిధిలోని పి నారాయణపురం గ్రామం నందు భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ హైదరాబాద్,ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ రేకులకుంట అనంతపురం, ప్రాంతీయ పరిశోధనా సంస్థ కదిరి, కృషి విజ్ఞాన కేంద్రం గరుడాపురం కళ్యాణదుర్గం వారి మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామ రైతులకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా రైతుల నుద్దేశించి భారత నూనెగింజల పరిశోధనా సంస్థ డైరెక్టర్ డా.మాతుర్, డా.మంజునాథ్, సతీష్‌లు ఆముదం పంటలో అధిక దిగుబడినిచ్చే కొత్త రకాలు ఐసిహెచ్ 5 మరియు 66 మేలైన యాజమాన్య పద్ధతుల గురించీ వివరించారు. డాక్టర్లు విజయ శంకర్, వెంకటేష్, చెన్నారాయుడు రైతులను ఉద్దేశించి మేలైన మెట్ట సేద్య పద్ధతులను రైతులకు సూచించి తెలియచేసారు. అనంతరం డా,మాతుర్ చేతులమీదుగా పి.నారాయణ పురం, కలగళ్ళ, ఇప్పేరు గ్రామ రైతులకు ఒక ఎకరాకు సరిపడా 4 కేజీల నూతన ఆముదం రకం ఐసిహెచ్ 5 రకాన్ని ఉచితంగా రైతులకు అం దచేసారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ హనుమంతరెడ్డి, మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ రైతు సేవాకేంద్ర సిబ్బంది ప్రమోద్ సాయి, రాజకుమార్, భాస్కర్ నాయక్, శ్రీలతగ్రామ రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు

# ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని మంత్రులను ఆహ్వానించిన ముంటిమడుగు కేశవరెడ్డి



మంత్రులను ఆహ్వానిస్తున్న దృశ్యాలు

అనంతపురం, జూన్ 6 ప్రభాతవార్త బ్యూరో

విజయవాడలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు కింజారపు అచ్చం నాయుడు గారిని మర్యాదపూర్వకంగా కలిసిన అనంతపురం ఉమ్మడి జిల్లా ఎడిసిసి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి ఈనెలలో అనంతపురం నగరంలో తన ప్రమాణ స్వీకారానికి రావాలని మంత్రిని ఆహ్వానించారు. మంత్రి కేశవరెడ్డికి శాలువ కప్పి సన్మానించారు. అచ్చం నాయుడుకి కేశవరెడ్డి వెంకటేశ్వర స్వామి ప్రతిమని అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయనతోపాటు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్ మురళి మంత్రి కలిశారు.

# ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి - అపుస్మా నేతలు

అనంతపురం న్యూటౌన్, జూన్ 6 ప్రభాతవార్త

గత మూడు సంవత్సరాలకుగాను (2023-2025) 12.1.సికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం వారి నుంచి కాని, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కాని ఏ పాఠశాల యాజామన్యాంకి అంద లేదు. కావున ఈ సంవంత్సవత్సరం (2025-2026) అడ్మిషన్లు చేయండి అంటూ విద్యా శాఖ వారు తీవ్రమైన ఒత్తిడి చేయుచున్నారని అపుస్మా నేతలు విన్నవించారు.

ప్రభుత్వం నిర్ణయించిన తక్కువ ఫీజుతో అన్ని సౌకర్యాలు కల్పించా లంటే యాజ మాన్యం వారికి ఆర్థికంగా చాలా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం మా బాధను అర్థం చేసుకుని గత 3 సంవత్సరాల నుంచి రావాల్సిన బకా యిలు, ఈ సంవత్సరం ఫీజు కూడా మా అసోషియేషన్ వారి ని చర్చలు పిలిచి తగు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. 12.1.సి అడ్మిషన్ల విషయంలో మా పాఠశాలల వారికి తగినంత సమయం ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. అనం తరం జిల్లా విద్యాశాఖ అదికారి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అపుస్మా జిల్లా ప్రెసిడెంట్ కె.సుబ్బారెడ్డి, స్టేట్ కోఆర్డినేటర్ కె.పుల్లారెడ్డి, శ్రీనాథ్, ఎం.నాయుడు, చంద్ర, సూర్య నాయణరెడ్డి, మధు సూధన్‌రెడ్డి, సుగునాకర్, సాయి, లక్ష్మన్న, రవీంద్రనాథ్‌రెడ్డి, రామ చం ద్రారెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.


డిఇఓకు వినతిపత్రం అందజేస్తున్న అపస్మా నేతలు

# నేత్రపర్వంగా వినాయక విగ్రహ ప్రతిష్ట

అనంతపురం వైద్యం, జూన్ 6 ప్రభాతవార్త

నగరంలోని లలితకళాపరిషత్తు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీసిద్ధి వినాయక ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం కన్నుల పండువగా సాగింది. ఉదయం సత్యనారాయణశర్మ నేతృత్వంలో పలువురు వేదపండితులు మహన్యా సపూ ర్వక రుద్రాభిషేకాలు, వాస్తు హోమం, ప్రాణ ప్రతిష్టలను శాస్త్రోక్తంగా జరిపించారు. వివిధ పుష్పాలతో పాటూ" మోదు కలతో అలంకార సేవలు నిర్వహించారు. వందల సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలందుకున్నారు. ఎల్కేపి కార్యదర్శి పద్మజ మాట్లాడుతూ కల్లూరు సుబ్బారావు లలితకళా పరిషత్తు ఎంతో మంది కళాకారులకు జన్మని చ్చిందని అందరికి మానసిక ప్రశాంతతనిచ్చేందుకు ఇదే ప్రాంగణంలో ఆలయం నిర్మించామన్నారు. అదేవి ధంగా ప్రతిరోజు భక్తులకు దర్శనం ఏర్పాటు చేస్తున్నామని ఎవరైనా వచ్చి పూజలు జరిపించుకో వచ్చున్నారు. మధ్యాహ్నం నారాయణ సేవ పేరిట అన్న దాన సేవలు జరిగాయి. ఎల్కేపి కార్యవర్గ సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న లలిత కళాపరిషత్ సభ్యులు మరియు భక్తులు

# త్యాగానికి ప్రతీక బక్రీద్..!

## ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ..!

రాప్తాడు, జూన్ 6 ప్రభాతవార్త

త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తోందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం స్ఫూర్తితో ప్రజలు సత్యం, న్యాయం, ధర్మం, త్యాగం, సహనం, పరోప కారం, బాధ్యతాభావం అలవరచుకోవాలని ఆయన కోరారు. దేవుడి దయతో ప్రజలందరూ ఆరోగ్యాలు, సుఖ శాంతులుతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల ందరికీ అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాం క్షించా రు. జిల్లాలో ఎల్లప్పుడూ మత సామరస్యం వెల్లివిరియాలన్నారు. బక్రీదు సందర్భ ంగా ముస్లిం సోదరులకు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.


తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

# రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఏదీ...?

## దళిత బాలికను ఆరు నెలలుగా అత్యాచారం చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి - యంపిపి హేమలత

ఆత్మకూరు జూన్ 6 ప్రభాతవార్త

రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని ఏడుగుర్రాలపల్లె గ్రామంలో గత ఆరు నెలలుగా దళిత వర్గానికి చెందిన అమ్మాయిని అత్యాచారాని పాల్పిడిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని యంపిపి హేమలత డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని తన కార్యలయంలో సర్పంచ్ వరలక్ష్మి, కురుబ కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ పార్వ తమ్మ ఆధ ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని దుయ్యా బట్టారు. రాప్తాడు నియోజకవర్గంలో సైతం అరాచాలు పెరిగిపోయా యని మండి పడ్డారు.గత ఆరు నెలుగా ఏడుగుర్రా లపల్లెలో దళిత వర్గానికి చెందిన అమ్మాయిని 14 మంది దుర్మార్గులు అత్మాచారానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.మతిస్థితం కోల్పోయిన తల్లితో అనాధిగా ఉంటూ స్కూల్‌కు వెళ్లె మైనర్ బాలికను ఆరు నెలుగా అత్యాచారానికి పాల్పడిన దుర్మార్గులను తగిన చర్యలు తీసుకోవాలని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే పరిటాల సునీత స్వంత గ్రామానికి కూతవేటు ఉన్న గ్రామంలో ఇంత దారుణానికి చోటుచేసుకోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోం దన్నారు. అత్యాచారానికి పాల్ప డిన నిందితులు టిడిపి వర్గానికి చెందిన వారు కావడంతో నింది తులను కాపాడుతున్నారనే విమ ర్శలు వినిపిస్తున్నాయి. అత్యా చారానికి గురైనా బాధితరాలుకు రాష్ట్రహోమం మంత్రి,నియో జకవర్గ ఎమ్మెల్యే తగిన న్యాయం చేయాలని కోరారు. భవి ష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకూడదు అంటే నిందితులకు కఠిన శిక్ష విధించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సర్పంచ్ వరలక్ష్మి,మాజీ సర్పంచ్ పార్వతమ్మ, మండల వైసీపీ నాయకులు పాల్గోన్నారు.


మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

# మలేరియా నివారణకు ముందస్తు చర్యలు

అనంతపురం వైద్యం జూన్ 6 ప్రభాతవార్త

రాబోయే వర్షాకాలపు సీజన్ దృష్టిలో ఉంచుకొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెంటినరి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ మాగ్నెట్ జూనియర్ కాలేజ్ ఫర్ గర్ల్స్, కేజీబీవీ పాఠశాలల లో మలేరియా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా మిలాథియాన్ డబ్ల్యు డి పి 25 అనే మందును పిచికారి చేశారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య మాట్లాడుతూ ఈ మందు ఆరు వారాల నుండి రెండు నెలల వరకు సమర్థ వంతంగా పనిచేసి మలేరియాను నివారిస్తుందని తెలియజేశారు. అనంతరం కాలేజీ విద్యార్థులకు దోమల వల్ల వచ్చే జబ్బుల గురించి వాటి నివారణ చర్యల గురించి అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగజ్యోతి మాట్లాడుతూ హాస్టల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థి హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడానికి సహకరించాలని, దోమలు కుట్టకుండా తగి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ సూపర్వైజర్ నూర్ భాషా, కళాశాల స్టాఫ్ నర్స్ విజయలక్ష్మి, కురుగుంట సచివాలయం ఆరోగ్య కార్యదర్శి సుధారాణి, ఆరోగ్య సహాయకులు అనిల్, హరికృష్ణ, మురళి, రాఘవేంద్ర, కుల్లాయి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# 17 మంది జూదరులు అరెస్ట్

## -రూ.1.25 లక్షలు, 17 సెల్‌ఫోన్లు, 9 మోటర్‌సైకిళ్లు స్వాధీనం

తాడిపత్రిటౌన్, జూన్ 6 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణ సమీపంలోని చుక్కలూరు ఫ్యాక్టరీల్లో జూదమాడుతున్న వారిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఫ్యాక్టరీల్లో జూదమాడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు జరిపి జూదమాడుతున్న 17 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 1.25 లక్షల రూపాయల నగదు, 17 సెల్‌ఫోన్లు, 9 మోటర్‌సైకిళ్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

# వివాహ వేడుకలకు హాజరైన డిసిఎంఎస్ మాజీ డైరెక్టర్ బొమ్మనశ్రీరామిరెడ్డి

శింగనమల, జూన్ 6 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగిన జల్లి భాస్కర్ వివాహ వేడుకకు డిసిఎంఎస్ మాజీ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, వైఎస్ఆర్‌సిపి నాయకులు ముచ్చుకోట శ్రీకాంత్‌రెడ్డి, దుద్దుకుంట భాస్కర్‌రెడ్డి, ఎల్.రాజు, జల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

04ATP06_04ATP06.qxd 06-06-2025 PM 11:30 Page 1



# అభం శుభం తెలియని బాలిక విషయంలో కూడా నీచ రాజకీయాలేనా

## - వైసీపీ నాయకులకు కనీసం ఇంకిత జ్ఞానం ఉందా - మైనర్ బాలికపై అఘాయిత్యంలో పోలీసులు అరెస్టులు చేస్తున్నారు - ఏ పార్టీ వారు ఉన్నా.. ఏ కులం వారున్నా చర్యలు తీసుకోమని చెప్పాం - మహిళల విషయంలోనైనా మీ వికృత రాజకీయాలు, రాతలు మానుకోండి - రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, జూన్ 6 ప్రభాతవార్త బ్యూరో

వైసీపీ నాయకులు ఇప్పటి వరకు శవాలను అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలు చేశారనుకుంటే, ఇప్పుడు అమాయక మైనర్ బాలిక విషయంలో కూడా వికృత రాజకీయాలు చేస్తున్నారంటూ రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ధ్వజమెత్తారు. రామగిరి మండలంలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న ఒక గ్రామంలో మైనర్ బాలికపై అఘాయిత్యం చేసిన సంఘటనలో టీడీపీ నేతలు ఉన్నారని.. వారిని పరిటాల సునీత వెనకేసుకొస్తున్నారంటూ సాక్షి దిన పత్రికలో వచ్చిన వార్త మీద తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరి ప్రోద్బలంతో ఇలాంటి వార్తలు రాస్తున్నారు.. కనీసం వివరణ తీసుకునే పద్ధతి లేదా అంటూ ప్రశ్నించారు. ఈ ఘటన తనకు తెలిసిన వెంటనే ఇందులో ఏ పార్టీ వారు ఉన్నా..ఏ కులం వారు ఉన్నా.. ఏ మతం వారు ఉన్నా... వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించా మన్నారు. మైనర్ బాలిక పట్ల ఇంత దారుణంగా వ్యవహరించిన వారిని ఎవరైనా వెనుకేసుకొస్తారా అంటూ నిలదీశారు. ఇలాంటి సంస్కార హీనమైన ఆరోపణలు మీ కరపత్రికలో ప్రచురించడం మాను కోవాలని మండిపడ్డారు. ప్రస్తుతం ఈ కేసులో నలుగుర్ని అరెస్ట్ చేస్తే.. అందులో ఇద్దరు వైసీపీకి చెందిన వారు ఉన్నారని.. దీనికేం సమాధానం చెబుతారని నిలదీశారు. మనుషుల చావులతో ఎలాగో రాజకీయాలు చేస్తున్నారు.. మీ కుట్ర, నీచ రాజకీయాలకు కనీసం అమాయక బాధిత బాలికలను, మహిళల్ని అయినా వాడుకోకుండా ఉండాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. ఈసంఘటనను జిల్లా ఎస్పీ కూడా సీరియస్ గా తీసుకుని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సునీత కోరారు.



రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

# 14 ఏళ్ల బాలికపై లైంగిక దాడి..!

## - సమాజం ఎక్కడికి వెళ్తోంది. - బాధిత బాలికకు న్యాయం చేయడంలో నిర్లక్ష్యం ఎందుకు - మాజీమంత్రి సాకే శైలజానాథ్

అనంతపురం సిటీ, జూన్ 6 ప్రభాతవార్త

సభ్య సమాజం తలదించుకునేలా అమాయక 14ఏళ్ల దళిత ఆడబిడ్డపై లైంగిక దాడి జరిగినా పోలీసులు బాధితురాలికి న్యాయం చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ప్రశ్నించారు. జిల్లా వైసిపి కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ.. రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని ఏడు గుర్రాలపల్లి గ్రామంలో దళిత మైనర్ బాలికపై అత్యాచారం జరిగి గర్భం దాల్చిన ఘటనలో పోలీసులు ఎవరిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రం ఇప్పటికే హింసాత్మక వాతావరణంలోకి వెళ్తోందని, 125కుపైగా అత్యాచార కేసులు నమోదై ఉన్నాయన్నారు. రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని 14 ఏళ్ల బాలికపై పలు మార్లు పలువురు యువకులు లైంగిక దాడి చేయడంతో ప్రస్తుతం సదరు బాలిక గర్భం దాల్చిన ఘటన వెలుగు చూసినప్పటికీ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం, బాధితురాలి ఇంటికి తాళం వేసి ఉందని మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ఇంటికి తాళం వేసి ఉందని తెలియడానికి ప్రత్యేక బృందాలు అవసరం లేదని, గ్రామంలో ఎవరికి ఫోన్ చేసినా చెబుతారన్నారు. ఇందులో తాము రాజకీయ ప్రయోజనాల కోసం పని చేయడం లేదని, బాధితురాలికి న్యాయం జరగాలన్నదే తమ ఆలోచన అన్నారు. బాధిత బాలిక తండ్రి ఎన్నికల ఫలితాల అనంతరం టిడిపి ర్యాలీకి వెళ్లి మృతి చెందారని, తల్లి మతిస్థిమితంతో బాధపడుతోందన్నారు. గర్భం దాల్చిన ఘటన వెలుగు చూడగానే, బాధిత బాలికతోపాటు వారి తల్లి అజ్ఞాతనంలోకి వెళ్లారనిచెబుతున్నారని, వారే అజ్ఞాతంలోకి వెళ్లారా.. వారు అజ్ఞాతనంలోకి వెళ్లేందుకు ఎవరైనా ప్రయత్నించారా అన్నది పోలీసులు దృష్టి సారించాలన్నారు. తమకు ఫిర్యాదు అందలేదని స్థానిక సిఐ చెబుతున్నారని అవసరమైతే తమ తరుపున గాని, సంఘాల తరుపున కానీ ఫిర్యాదు చేసేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. సోషల్ మీడియా కేసుల్లో యువత తల్లిదండ్రులను అదుపులోకి తీసుకుని వారిని రప్పించిన పోలీసులు దళిత బాలిక విషయంలో ఎందుకు ఆ దిశగా చర్యలు తీసుకోలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు. పోలీసులే సుమోటాగా కేసు నమోదు చేయవచ్చుగా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభ త్వం, అధికారులు బాలికకు న్యాయం చేసే దిశగా బాధ్యత తీసుకోవాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బాధిత బాలికకు భద్రతోపాటు న్యాయం జరగాలన్నదే తమ ఆకాంక్ష అని ఆయన స్పష్టం చేశారు. విలేకర్ల సమావేశంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్ర, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నరసింహులు, బుక్కరాయసముద్రం జడ్పిటిసి నీలం భాస్కర్, వైసిపి నాయకులు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

# హెచ్ ఎల్ సి గండ్లకు శాశ్వత పరిష్కారం.. ఎమ్మెల్యే కాలవ

డి. హిరేహాళ్, జూన్ 6, ( ప్రభాతవార్త )

హెచ్ ఎల్ సి గట్లకు గండ్లు పడకుండా ఆయకట్టు రైతుల కడగండ్లకు శాశ్వత పరిష్కారం చూపేందుకే రూ.35కోట్లతో మరమ్మతు పనులు చేపట్టడం జరిగిందని రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం డి. హిరేహాళ్ మండలం నాగలాపురం వద్ద జరుగుతున్న హెచ్చెల్సి పనులను ఎమ్మెల్యే అధికారులను విచారించి పరిశీలించి పనుల్లో నాణ్యతను పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రూ.35కోట్లతో హెచ్చెల్సి ప్రధాన కాలువ మరమ్మతులు చేపట్టిందని విడతల వారీగా సమీక్షల అనంతరం సీఎం చంద్రబాబుతో చర్చల అనంతరం శరవేగంగా మరమ్మత్తుల పనులకు నిధులు కేటాయిం చడం జరిగిందని కాలువ చెప్పారు. ఏటా ఆయకట్టుదారుల కంటిమీద కునుకులేకుండా చేస్తున్న కాలువ గండ్లకు ఈ పనులతో శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఆయన మరమ్మత్తు పనులపై వివరిస్తూ కాలువకు సాగునీరు అందేలోపు పనులు పూర్తి చేసేలా సమగ్ర ప్రణాళిక రూపొందించటం జరిగిందన్నారు. ఇప్పటికే 30శాతం మరమ్మతు పనులు పూర్తయ్యాయని, జూలై ఆఖరి నాటికి దాదాపు పూర్తిచేస్తామని, అప్పటికి మిగిలిన పనులు ఆగస్టు ఆఖరికి పూర్తి చేయిస్తమన్నారు. యేడాది నీటి విడుదలపై రైతులకు ఎలాంటి దిగులు అవసరం లేదని, హెచ్చెల్సి ప్రధాన కాలువకు నాగలాపురం వద్ద దాదాపు ప్రతి ఏటా గండ్లు ఏర్పడడం జరుగుతొందన్నారు. పంట కాలంలో నీటి పంపిణీకి అంతరాయం ఏర్పడి రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుందన్నారు. ఐదేళ్ల వైకాపా పాలనలో ఈ సమస్యపై ప్రభుత్వం ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదు. పైగా కాలువ పనులు 2025 మర్చి వరకు చేయటానికి వీల్లేదని మారటోరియం ఉత్తర్వు ఇచ్చిందని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్య తీవ్రతను వివరించామన్నారు. వైకాపా విధించిన మారటోరియం ఉత్తర్వులు రద్దు చేయించమన్నారు. రాష్ట్ర అసెంబ్లీ లో సమస్యను ప్రస్థావించటంతో పాటు వివిధ సందర్భాల్లో ముఖ్య మంత్రి, సంబంధిత మంత్రులకు వివరించామన్నారు. ముఖ్యమంత్రి ఆమోదంతో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించగా... ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్లో రూ.35కోట్లు మంజూరు చెయించారన్నారు. వీరందరి సహకారంతో కాలువ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. రైతులకు ఇబ్బంది లేకు ండా సకాలంలో పనులు పూర్తి అయ్యేలా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. తుంగభద్ర నుండి హెచ్చెల్సికి ఏటా అందాల్సిన నిఖర జలా లతో పాటు అదనపు జలాల వినియోగానికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.



హెచ్ ఎల్ సి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ



పనుల వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలవ

# బక్రీద్ పర్వదినం వేళ పటిష్ట భద్రతా చర్యలు చేపట్టండి

## - అవాంఛనీయ ఘటనలకు తావుండకూడదు
## - ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పి పి.జగదీష్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 6 ప్రభాతవార్త

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పి పి.జగదీష్ ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావుండకూడదన్నారు. జిల్లా వ్యాప్తంగా వున్న ప్రధాన మసీదులు, మదరసాలు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సున్నిత ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా వుంచాల న్నారు. బీట్లు, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా వుంచాల న్నారు. వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌తో సహా ఏదైనా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో ఏవైనా అభ్యంతరకరమైన పోస్ట్ షేర్ చేస్తే చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. జిల్లాలో సామాజిక మాధ్య మాల గ్రూపుల్లో వచ్చే సందేశాలు, దృశ్యా లపై ప్రత్యేక నిఘా వుంచామని, సైబర్ విభాగం పోలీసులు 24/7 ఆయా గ్రూపులను పర్యవేక్షిస్తూ వుంటారన్నారు. పండుగ సందర్భంగా ప్రజల రద్దీ ఎక్కువగా వుండే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను సులభతరం చేయాల న్నారు. జంతు వధశాలల వద్ద నీటి సమస్య, పారిశుద్ధ్యం, విద్యుత్ సమస్యలు తలెత్తకుం డా సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టాలన్నారు. త్యాగానికి, సహనానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను శాంతి సామరస్యాలు వెల్లివిరిసేలా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ జిల్లాలోని ముస్లిం సోదర సోదరీమణులకు జిల్లా ఎస్పి బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలియచేశారు.



జిల్లా ఎస్పి జగదీష్

# చింతకుంట మధు పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి- నగర మేయర్ మహమ్మద్ వసీం

అనంతపురం, జూన్ 6 ప్రభాతవార్త బ్యూరో

జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి చింతకుంట మధు పై టీడీపీ నేతలు దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నగర మేయర్ మహమ్మద్ వసీం డిమాండ్ చేశారు. నగరంలోని 39వ డివిజన్ పరిధిలో వైసీపీ అధికార ప్రతి నిధి చింతకుంట మధుపై శుక్రవారం టీడీపీ నేతలు దాడి చేశారు. విషయం తెలుసుకున్న మేయర్ మహమ్మద్ వసీం,వైసీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, బాధితులు చింతకుంట మధుతోపాటు వైసీపీ నేతలతో కలసి వెళ్లి 4వ పోలీసు స్టేషన్ లో దాడి ఘటనపై పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మహమ్మద్ వసీం విలేకరులతో మాట్లాడు తూ నగరంలోని 39వ డివిజన్ పరిధిలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో తనతో పాటు స్థానిక కార్పొరేటర్ కుమారుడైన చింతకు ంట మధు పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారన్నారు.అయితే కార్యక్ర మం.పూర్తి అయిన తర్వాత స్థానిక టీడీపీ నేతలు టీడీపీ పాలనలో వైసీపీ కార్పొరేటర్లు ఎలా అధికారిక కార్యక్రమాలలో పాల్గొంటారని సచివాలయ సిబ్బందిని దూషిస్తూ కార్పొరేటర్ కుమారుడైన చింతకుంట మధుపై మూకుమ్మడిగా దాడి చేయడం కూటమి పాలనలో అరాచకాలకు నిదర్శనం అన్నారు. దాడి ఘటన తర్వాత 4వ పోలీస్ స్టేషన్ సిఐ కి ఫోన్ చేస్తే తాను లీవ్ లో ఉన్నాను ఎస్ఐను కలవమన్నారని,ఎస్ఐకు ఫోన్ చేస్తే స్టేషన్ కు రమన్నారని తాము వెళ్తే భోజనం చేస్తున్నారన్నారు.50నిమిషాలు గడిచినా ఎస్ఐ భోజనం చేస్తునే ఉన్నారని పిర్యాదు తీసుకునేందుకు భయపడే ఎస్ఐ ఇక ఉద్యోగం ఎందుకు చేయాలని ఆయన ప్రశ్నించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నగరం ప్రశాంతంగా ఉండేదని,అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి ఏనాడు కబ్జాలు,దౌర్జన్యాలను ప్రోత్సహించలేదన్నారు.నేడు కూటమి పాలనలో నగరంలో అరచకాలు అధికమయ్యాయని గత మూడు రోజులుగా ప్రధాన పత్రికలలో వస్తున్న వార్తలే ఇందుకు నిదర్శనం అన్నారు. ఇటీవల తన ఛాంబర్ లోకి సైతం టీడీపీ నేతలు దౌర్జన్యంగా ప్రవేశిస్తే ఎస్పీ కి పిర్యాదు చేసినా పట్టించుకోలేదని,నాడు ఎస్పీ కఠినంగా వ్యవహరించి ఉంటే నేడు ఇలాంటి ఘటనలు జరిగి ఉండేవి కాదాన్నారు. చింతకుంట మధు పై దాడి చేసిన భాద్యులపై చర్యలు తీసుకోవా లని లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బాధితుడు చింతకుంట మధు మాట్లా డుతూ తన డివిజన్ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమంలో మేయర్ వసీం పాల్గొని వెళ్లిన తర్వాత స్థానిక టీడీపీ నేతలు మోహన్ కుమార్,అఖిల్,ఏ ఆర్ కానిస్టేబుల్ నరేంద్ర లతో పాటు 10 మంది వచ్చి మా ప్రభుత్వంలో మీరు ఎలా కార్యక్రమాలు చేస్తారని మూకుమ్మడిగా దాడి చేశారన్నారు.భాద్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు పిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నా రు.వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్ర మాట్లాడుతూ నగరంలో గతంలో ఎందరో ఎమ్మెల్యేలుగా పనిచేసారని,ఏ ఎమ్మెల్యే కూడా ప్రస్తుత ఎమ్మెల్యే లాగా దాడులు, దౌర్జన్యాలను ప్రోత్సహించలే దన్నారు. అధికారిక కార్యక్రమంలో మేయర్ తోపాటు తన తల్లి అనారోగ్యం వల్ల ఆమె కుమారుడు పాల్గొంటే టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారన్నారు. కమిషనర్ సైతం కార్పొరేటర్లను పక్కన పెట్టి టీడీపీ నేతలతో అధికారిక కార్యక్రమాలు చేయించాలని చెపుతుండటం దురదృష్టకరమన్నారు. కూటమి ప్రభుత్వంలో దౌర్జన్యాలను ప్రజల పక్షాన వైసీపీ తరపున పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు,వైసీపీ నేతలు పాల్గొన్నారు.



పోలీసులకు పిర్యాదు చేస్తున్న బాధితుడు చింతకుంట మధు



మాట్లాడుతున్న మేయర్ వసీం

# వైద్యులు, సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 6 ప్రభాతవార్త

ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వైద్యులు, సిబ్బంది ఆసుపత్రికి వచ్చే రోగులతో స్నేహపూర్వకంగా మెలగాలని, ప్రతి ఒక్కరి ప్రవర్తన బాగుండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరే ట్ లోని రెవెన్యూ భవనంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే వైద్య సేవల మీద ఆర్‌టిజిఎస్ ద్వారా తీసుకున్న ఫీడ్‌బ్యాక్ పై జిల్లాలోని పిహెచ్‌సి, యుపిహెచ్‌సి, ఎన్టీఆర్ వైద్య సేవ ఆసుపత్రుల డాక్టర్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది ప్రొఫెషనల్‌గా వుండాలని, ప్రవ ర్తన మంచిగా వుండాలన్నారు. ప్రతి ఒక్కరూ వైఖరి మార్చుకొని స్నేహ పూర్వకంగా మెలగాలని, ఆసుపత్రి సిబ్బందితో కూడా మాట్లాడి వారికి ఈ విషయాన్ని తెలియచేయాలన్నారు. ఆసుపత్రిలోని ఫార్మసిస్టులను ఎప్పటిక ప్పుడు మానిటర్ చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ మంచిగా ప్రవర్తించాలన్నారు. ఆయా ప్రశ్నలకు సంబంధించిన ఫీడ్‌బ్యాక్‌పై ప్రభుత్వం సీరియస్ గా వుందన్నారు. ఏ ఆసుపత్రిలో పరిశీలన జరుగుతుందో తెలియదని, క్షేత్రస్థాయిలో రియాలిటీని తనిఖీ చేయడం జరుగు తుందని, అందరూ జాగ్రత్తగా వుండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబి.దేవి, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి, పి.హెచ్.సి, యు.పి.హెచ్.సి, ఎన్టీఆర్ వైద్య సేవ ఆసుపత్రుల డాక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



పాల్గొన్న డాక్టర్లు, సిబ్బంది

# కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసిన చంద్రశేఖర్

మడకశిర జూన్ 06 ప్రభాతవార్త: సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రంలో శుక్రవారం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మరియు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి పర్యటించారు. ఇందులో భాగంగా కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ చంద్రశేఖర్ మంత్రి సీతారామన్ ని మర్యాదపూర్వకంగా కలిసారు. నేషనల్ కస్టమ్స్ అండ్ ఎక్సైజ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ (నాసిన్) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించి మద్దతుగా నిలబడడం తో అయన మంత్రి సీతారామన్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ శిక్షణా సంస్థ రాష్ట్రా అభివృద్ధికి ఉపాధికి ఎంతో సౌకర్యావంతంగా ఉంటుందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి సీతారామన్ దూరదృష్టి, నిబద్ధతకు అభినందనలు తెలియ జేస్తూ, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ఇదే స్పూర్తిగా నిలవా లని కోరారు. అత్యంత వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి మరింత సహకారం అందించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం అసెంబ్లీ కన్వీనర్ నల్లపేట ఆదర్శ్ కుమార్ హిందూపురం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సరస్వతి,శంకర్, తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కు ధన్యవాదాలు తెలుపుతున్న చంద్రశేఖర్

# చెత్త సేకరణపై ఆకుతోటపల్లి గ్రామపంచాయతీలో అవగాహన కార్యక్రమం

## - జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు

అనంతపురం కలెక్టరేట్, జూన్ 6 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా నగరానికి అనుగుణంగానున్న ఆకుతోటపల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం చెత్త సేకరణ ఎలా వేరు చేయాలన్న అంశం పైన గ్రామపంచాయతీ మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. శుక్రవారం జిల్లా పంచాయతీ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఆయన ప్రభాతవార్తకు పంచాయతీల అభివృద్ధి పైన అనేక అంశాలను తెలియచేశారు. ఆకుతోటపల్లిలోని ఎస్‌డబ్ల్యూపిసి ని సందర్శించి డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్ గురించి ప్రజల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించా మన్నారు. తడి చెత్తను పొడి చెత్తను ఇంటి దగ్గరే వేరు వేరుగా సేకరించాలని ఎస్‌డబ్ల్యూ పిసి వర్కర్లకు, గ్రామంలోని ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఆకుతోటపల్లిలోని ఎస్‌డబ్ల్యూపిసి సెంటర్‌ను సుప్రీం స్థానిక శిక్షణ కేంద్రంగా ఎంచుకోవడం జరిగిందని అలాగే అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమం పైన ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తుంటామని ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు జాగ్రత్త వహించాలని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి టి. నాగరాజు నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి వెంకట నాయుడు, గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్‌బాబు, పంచాయతీ కార్మికులు, గ్రామపంచాయతీ సర్పం చు, గ్రామపంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.



ఎస్‌డబ్ల్యూపిసిని సందర్శిస్తున్న డిపిఒ నాగరాజునాయుడు

# వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ అందించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

పుట్లూరు, జూన్ 6 ప్రభాతవార్త

పుట్లూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ చౌక ధాన్యపు డిపోల ద్వారా వృద్ధులకు బియ్యం సరుకులను శుక్రవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వారి ఇంటి వద్దకే వెళ్లి అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో రేషన్ బియ్యం కావాలంటే ఉపాధి కూలి పనులు మాని బియ్యం కోసం ఎదురుచూసే పరిస్థితి వుండేదన్నారు. ఎక్కడో దూరంగా ఊరి చివర ఎండియు వాహనాలు నిలబెట్టి కేవలం ఒక్కపూట మాత్రమే బియ్యం ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎండియు వాహనాల ద్వారా రేషన్ ఇచ్చే విధానాన్ని రద్దు చేసి చౌక ధాన్యపు డిపోల ద్వారా నెలలో 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు బియ్యం సరుకులు పొందే విధంగా ఏర్పాటు చేశారన్నారు. అంతేకాకుండా నడవలేని, బియ్యం బరువు మోయలేని 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులుకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించడం జరుగుతోందన్నారు. గతంలో కేవలం ఒకరోజు మాత్రమే బియ్యం పొందే అవకాశం వుండేదని ప్రస్తుతం 15 రోజుల్లో బియ్యం పొందేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసు కోవడం పట్ల ప్రజలు సం తోషాన్ని వ్యక్తం చేస్తున్నా రని ఎమ్మెల్యే పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో మం డల తేదేపా నాయ కులు, కార్యకర్తలు, అధికా రులు, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధునికి రేషన్ అందచేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

# పుట్టపర్తిని పర్యాటకంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం - ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి టౌన్, జూన్ 6, ప్రభాతవార్త

పుట్టపర్తిని పర్యాటకంగా అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అందులో భాగంగా నేడు ప్రముఖ జయాలుకాస్ జ్యువలరీ కంపెనీ ప్రతినిధులు కోటి రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చారు.వాణిజ్య సంస్థల సామాజిక బాధ్యత నిధి ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రముఖ కంపెనీలను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు.శుక్రవారం పుట్టపర్తి లోని జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అధ్యక్షతన జోయాలుకాస్ జ్యువలరీ ప్రతినిధులు,టూరిజం, ఇరిగేషన్ జిల్లా అధికార యంత్రాంగంతో పుట్టపర్తి అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహిం చారు .భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు సందర్భంగా పలు అభివృద్ధి పనులకు తమ వంతు చేయు తనివ్వాలని పలు కార్పొరేట్ సంస్థలను ఎమ్మెల్యే కోరా రు. అందులో భాగంగా సత్య సాయి బాబా నడయా డిన చిత్రావతి నదిని అత్యంత సుందరీ కరణంగా తీర్చిదిద్ది ఫుట్పా త్తులు, లైటింగ్స్‌తో పర్యాటకులను ఆకట్టు కునే విధంగా పార్కులు వంటివి అభివృద్ధి పనులకై శ్రీకారం చుడుతున్నామని తెలియజేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి









వృద్ధునికి రేషన్ అందచేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం దృశ్య మాలిక

# అభివృద్ధే ద్యేయంగా కూటమి ప్రభుత్వం - ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

పుట్లూరు, జూన్ 6 ప్రభాతవార్త

అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి ఎంతో చూస్తున్నామని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో శుక్రవారం అదనపు తరగతి గదుల భవనాలకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నాడు-నేడు పేరుతో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరాయన్నారు. నాటి ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతో సిమెంట్ బస్తాలన్నీ వర్షాలకు తడిచిపోయి దేనికి పనికి రాకుండా పోయాయన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శేషారెడ్డి, ఎంఇఒ శ్రీదేవి, నాయకులు బాలరంగయ్య, సుదర్శన్‌నాయుడు, ఎల్‌కె చెన్నారెడ్డి, శ్రీనివాసులనాయుడు, సత్యంరెడ్డి, రవికుమార్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రామాంజి, వేణు, సుబ్బారెడ్డి, గోవర్ధన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ